

ఏప్రిల్ 2017

వసంతకాలం వచ్చింది!

కొత్తపల్లి

తెలుగు పిల్లల ఈ మాసపత్రిక వెల రూ.25/-





సంపుటి: 3   సంచిక: 3   పుటలు: 68   విడి ప్రతి వెల: 25 రూ.   ఏప్రియల్ 2017

Editor: Narayana Sarma

Owned, Printed and Published by:
Kottapalli Prachuranalu,
1-127/A, Near MRO Office,
Chennekothapalli,
Ananthapuramu District
Andhra Pradesh-515101
Website: http://kottapalli.in
Email: team@kottapalli.in
Phone: 7702877670

Printed at:
Mudrica Offset Printers,
Sanyasi Raju street,
Gandhi Nagar,
Vijayawada,
Andhrapradesh
Phone: 08662579129

RNI Registration No: APTEL/2014/62705
Postal Registration No: HDP/008/2015-17

సంపాదకులు: నారాయణ శర్మ

గౌరవ సలహాదారు: యు. సుబ్బరాజు

ప్రచురణ:

కొత్తపల్లి ప్రచురణలు, చెన్నేకొత్తపల్లి

యాజమాన్యం:

సత్య - ఫౌండేషన్ ఫర్ ఎ హెల్దీ సొసైటీ, చెన్నూరు.

చిత్రాలు:

అడవి రాముడు : 9491870753

వీరాంజనేయులు: 7799260684

వెబ్సైటు నిర్వహణ:

ఆనంద్, లక్ష్మి

వాణిజ్యం, మార్కెటింగు:

కె. మల్లికార్జున: 9000453887



విషయ సూచిక



ముఖచిత్రం: బాబా సాహెబ్

చిత్ర కారుడు: శంకర్

91



విపది ధైర్యమథాభ్యుదయే క్షమా
సదసి వాక్పటుతా యుధి విక్రమ:
యశసి చాభిరుచిర్వ్యసనం శ్రుతౌ
ప్రకృతి సిద్ధమిదం హి మహాత్మనామ్

సంస్కృత మూలం
(భర్తృహరి)

ఆపదలందు ధైర్యగుణ మంచిత సంపదలందు దాల్మియున్
భూప సభాంతరాళమున బుష్కల వాక్చతురత్వ మాజి బా
హాపటు శక్తియున్ యశమునందనురక్తియు విద్యయందు వాం
ఛాపరివృద్ధియున్, బ్రకృతి సిద్ధగుణంబులు సజ్జనాళికిన్

తెలుగు అనుసరణ
(ఏనుగు లక్ష్మణ కవి)

భావం:

ఆపదలు వచ్చినప్పుడు ధైర్యం, సంపదలొచ్చినప్పుడు ఓరిమి, సభలో చక్కగా మాట్లాడే చతురత, యుద్ధంలో బాహుబలం, కీర్తి యందు అభిరుచి, నేర్చుకోవటంలో ఇష్టం- ఇవన్నీ ఉత్తముల సహజ గుణాలు.

భారతరత్నం

స్వతంత్ర భారతదేశానికి మొదటి న్యాయశాఖ మంత్రిగా పనిచేసిన డా. భీమ్‌రావ్ అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాతగా మనందరికీ సుపరిచితుడు. చెప్పులుకుట్టే "మెహర్" కులానికి చెందినవాడు అంబేద్కర్. అంటరానితనం కారణంగా ఎనలేని కష్టాలకు అవమానాలకు గురైన భీంరావు, తర్వాతి కాలంలో పీడిత జాతులకు తమవైన హక్కుల్ని అందించిన మానవతామూర్తిగా ఎదుగుతాడని, మన వ్యవస్థకు పునాది అయిన రాజ్యాంగాన్ని తన చేతుల మీదుగా అందించి చిరస్మరణీయుడౌతాడని, అప్పట్లో ఎవ్వరూ ఊహించి ఉండరు.



రామ్‌జీ-భీమాబాయి దంపతుల పధ్నాలుగో సంతానమైన భీమ్‌రావ్ అర్ధరాత్రి పన్నెండు గంటలకు పుట్టాడట. అతను పుట్టేసరికి నక్షత్రాలు, గ్రహాలు ఏమాత్రం సరిగ్గా లేవు. తల్లి భీమాబాయి ఈ పిల్లవాడి కారణంగా చనిపోతుందని ఎవరో జ్యోతిష్కులు చెప్పటం, తండ్రి, సోదరులు అందరూ అతన్ని వేరేగా చూడటం.. అట్లా మొదలయ్యాయి అంబేద్కర్ కష్టాలు.

ఆయన తండ్రి రామ్‌జీ బ్రిటీషు సైన్యంలో సుబేదారుగా పనిచేసేవాడు. అయితే భీమ్‌రావ్‌కి ఐదేళ్ళు వచ్చేవరకూ బ్రతికింది భీమాబాయి. ఆవిడ పోయేసరికి వాళ్లకున్న పధ్నాలుగు మంది పిల్లల్లోను ఐదుగురు మాత్రమే బ్రతికారు. ఈ ఐదుగురు పిల్లలూ వాళ్ల మేనత్త దగ్గరే పెరిగారు- ఏమంటే తండ్రి మళ్లీ పెళ్లి చేసుకున్నాడు.

భీంరావు చిన్నప్పుడు కూడా చాలా శ్రద్ధగా చదువుకునేవాడు. బలే తెలివిగా ఉండేవాడు.

అయినా కులం కారణంగా అనేక అవమానాలకు గురైనాడు. తరగతిలో మిగతా పిల్లలకు దూరంగా, మూలగా కూర్చోవలసి వచ్చింది; నేలమీద పరుచుకునేందుకు తన జంపకానా తానే తెచ్చుకోవలసి వచ్చింది; పిల్లలందరూ నీళ్లు తాగే కొళాయిని అతను ముట్టుకోరాదు: బడిలో పనిచేసే ఉద్యోగి ఒకడు అతని కోసం కుళాయి తిప్పేవాడు. ఏనాడైనా ఆ ఉద్యోగి గనక రాకపోతే, ఇక ఆ రోజంతా భీమ్‌రావ్ మంచినీళ్లు తాగేకి వీల్లేదు! భీమ్‌రావ్‌కి, కాని వాళ్ల ఇంట్లో వాళ్లకి కాని, మంగలి వాళ్లు ఎవరూ క్షవరం చేసేవాళ్లు కాదు! భీమ్‌రావ్ జుట్టును వాళ్ల అక్కే కత్తిరించేది.



అంబేద్కర్‌కి తొమ్మిది ఏళ్లున్నప్పుడు, వాళ్ల అన్నతోటీ, మేనల్లుళ్ళతో కలసి మొదటిసారిగా రైలు ప్రయాణం చేసాడట. కొత్త ఇంగ్లీషు బట్టలు, మెరిసే టోపీలు, కొత్త చెప్పులు, జరీ ధోతీలు వేసుకొని, మెరిసిపోతున్న పిల్లల్ని చూసి అందరూ 'ఉన్నత కులం వాళ్ళు' అనుకున్నారట. అయితే వాళ్లు రైలు దిగగానే అక్కడి రైల్వే స్టేషన్ మాస్టరు వాళ్ల కులం అడిగి తెలుసుకున్నాడు. అంతే- ఇక ఎవ్వరూ వాళ్లతో మాట్లాడేందుకు ఇష్టపడలేదు! అక్కడ ఉన్న ఎద్దుల బండ్ల వాళ్లు ఎవరూ వీళ్లని బళ్ళలో ఎక్కించుకోలేదు! అతి కష్టం మీద, అక్కడ పనిలేకుండా ఉన్న ఒక బండివాడు ఒకడు ఎక్కువ డబ్బులకు ఒప్పుకున్నాడు. కానీ బండిని మటుకు వీళ్లే నడుపుకోవాలి- ఆ బండిని తను ఎక్కడు- తను ఆ బండి ప్రక్కనే నడుస్తూ వస్తాడట! అట్లా ఒక రోజంతా ప్రయాణించిన తర్వాత వాళ్ల నాన్న పని చేసే 'గోరేగాం' చేరుకున్నారు వాళ్ళు: ఆ ప్రయాణం మొత్తం మీద ఎవ్వరూ వాళ్లకు ఒక్క చుక్క మంచి నీళ్లు కూడా ఇచ్చేందుకు ఇష్టపడలేదు!

ఈ కష్టాలన్నీ భరించలేక, ఇల్లు వదిలి పారిపోయి బొంబాయిలో బట్టల మిల్లులో పనిచేద్దామనుకున్నాడట భీంరావు. అందుకుగాను అత్త పర్సులో డబ్బులు దొరుకుతాయోమోనని వెతికాడట కూడా! అయితే అదృష్టం కొద్దీ అందులో ఎక్కువ డబ్బులు లేవు. "అదే క్షణంలో నాకు అవమానం, సిగ్గు అనుభవానికి వచ్చినాయి. నేను పారిపోయే ఆలోచనను విరమించుకున్నాను" అని రాసుకున్నాడాయన. ఈ సంఘటనతో ఆయనకు చదువుల పట్ల శ్రద్ధ కుదిరింది.

ఆ తర్వాత కొన్నేళ్ళకు, హైస్కూల్ చదువుల కోసమని ఆయన బొంబాయి చేరాడు. అప్పుడు కూడా అంటరాని తనం ఆయన్ని వెంబడిస్తూనే ఉండింది. సంస్కృత పండితులు ఎవ్వరూ అతనికి పాఠాలు చెప్పేందుకు ఇష్టపడలేదు! అయితే దాని వల్ల కూడా ఆయనకు మేలే జరిగింది: పర్షియన్ నేర్చుకునే అవకాశం చిక్కింది!!

మన దేశంలో సనాతనంగా వస్తున్న కులవ్యవస్థ బరువుకు అణగిపోయిన కులంలో పుట్టి, అన్ని రంగాలలోనూ వివక్ష ఎదుర్కొన్నా కూడా, మొక్కవోని ధైర్యంతో తమ వారి హక్కులకోసం నిలబడి, ఏ రకంగా చూసినా అంటరానితనానికి ఎలాంటి సమంజసత్వమూ లేదని నిరూపించిన మానవతా వాది అంబేద్కర్. అంటరానితనం నిర్మూలనే ప్రాతిపదికగా అనేక చట్టాలను రూపొందించి, ఆ క్రమంలో వివిధ దేశాల న్యాయ విధానాల్ని, సంస్కృతుల్ని, చరిత్రని అధ్యయనం చేసి, 'తెలివి ఏ ఒక్కరి సొత్తూ కాదు' అని నిరూపించి, మన దేశానికి మార్గ దర్శనం చేసిన మేధావి, భారతరత్న- బాబాసాహెబ్ డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ చిరస్మరణీయుడు.

అంబేద్కర్ జయంతి శుభాకాంక్షలతో,

కొత్తపల్లి బృందం.



ఐకమత్యం

సేకరణ : పి.వాసవి, 8 వ తరగతి, జిల్లా పరిషత్ హైస్కూల్, పెద్ద పసుపుల గ్రామం.

అనగనగా ఒక ఊళ్లో ఒక మామిడి తోట ఉండేది. నల్ల చీమలు కొన్ని, అందులో ఒక పుట్టను పెట్టాయి.



ఇలా ఉండగా ఒక రోజు ఎక్కడి నుంచో ఒక పాము వచ్చింది, తోటలోకి. వచ్చి, తోట అంతా కలయ తిరిగింది. అయితే అంతలోకే వర్షం మొదలైంది. 'ఎటు పోవాలి...? ఎటో ఒకవైపు!' అనుకొని, అది చకచకా చీమలు పెట్టుకున్న పుట్టలోకే దూరింది.

దాంతో చీమలన్నీ భయపడ్డాయి. గబగబా బయటకు వచ్చాయి; కకావికలై పరుగులు పెట్టాయి. కొన్ని చీమలు, గ్రుడ్లు పాము కిందపడి నలిగిపోయాయి.

వర్షం ఆగిన తర్వాత పాము బయటికి

వచ్చింది. తన దారిన తాను ఎటో వెళ్ళి పోయింది-



కానీ తర్వాతి నుండీ ప్రతి రోజూ రాత్రంతా చీమల పుట్టలోనే నిద్ర పోసాగింది. మెల్ల మెల్లగా ఉదయం సమయాల్లోనూ ఉండటం మొదలెట్టింది. తర్వాత పుట్టను మొత్తాన్నీ ఆక్రమించుకుంటూ అక్కడే తన నివాసాన్ని ఏర్పాటు చేసుకునేందుకు ప్రయత్నించింది!

చీమలకు చాలా బాధ వేసింది. వాటికి ఇది నిజంగానే ప్రాణ సంకటం అయ్యింది: ప్రతిరోజూ వందలాది చీమలు పాముకు బలి ఔతున్నాయి. చివరికి "ఎలాగైనా పాము పీడ వదిలించుకోవాలి!" అని నిశ్చయించు-కున్నాయి అవన్నీ.

తర్వాతి రోజు ఎప్పటిలాగే పాము చీమల పుట్టలోకి దూరగానే, బయట కాపలా కాస్తున్న చీమలన్నీ ఒకే సారి లోపలికి పోయినై. అన్నీ కలిసి ఒక్కసారిగా పామును చుట్టు ముట్టినై. దాన్ని కసితీరా కుట్టసాగినై. నల్ల చీమలే అయినా, అన్నీ కలిసి కుట్టేసరికి పాము బిత్తరపోయింది. నిశ్చేష్టం అయిపోయింది. కదలలేక పోయింది. చివరికి అటూ ఇటూ పొర్లటం మొదలు పెట్టింది. అయినా వాటినుండి తప్పించుకోలేకపోయింది: ఆ ఇరుకులోనే తన్నుకులాడి, చివరికి ప్రాణాలు విడిచింది. చీమలన్నీ సంతోషంతో పండగ చేసుకున్నాయి.

బలవంతుడ నాకేమని
పలువురితో నిగ్రహించి పల్కుట మేలా?
బలవంతమైన సర్పము
చలి చీమల చేత చిక్కి చావదె, సుమతీ?




బంగారు నాణాల కథ

రచన:వైష్ణవి రెడ్డి, రిషివ్యాలీస్కూల్

అనగనగా ఒక ఊళ్లో ఒక ముసలమ్మ ఉండేది. ఆ ముసలమ్మకు ఇద్దరు కొడుకులు. పెద్దోడు మొద్దు; కానీ అతని మనసు మంచిది. చిన్నోడు బాగా చదువుకునేవాడు; కానీ అతనిలో చాలా స్వార్థం ఉండేది.

రోజులు, సంవత్సరాలు గడిచాయి. చిన్నోడు పరీక్షలు వ్రాసి పట్నంలో మంచి ఉద్యోగం తెచ్చుకున్నాడు. పట్నంలో ఉంటూ, అప్పుడప్పుడూ పల్లెకు వచ్చి తల్లిని, అన్నను చూసి పోయేవాడు. పెద్దోడు ఊళ్ళోనే ఉండేవాడు. వ్యవసాయం చూసుకుంటూ,

ఎవరూ లేని పిల్లలకు వాళ్ళు చదువుకునేంత వరకు చదువు చెప్పించేవాడు; ముసలమ్మని కనిపెట్టుకొని ఉండేవాడు-



అందుకని ఊళ్ళో వాళ్లంతా అతని గురించి మంచిగా అనుకునేవాళ్ళు.

అయినా చిన్నోడికి పెద్దోడు అంటే లక్ష్యం లేదు. పెద్దోడిని చూసి అసూయ పడేవాడు. పెద్దోడు మంచి కోరి ఏం చెప్పినా గానీ ఇతను చికాకు పడేవాడు.

ఒకసారి ముసలమ్మకు ఆరోగ్యం బాగా లేకుండా అయ్యింది. "తను చనిపో-బోతున్నది" అని అర్థం అయిందామెకు.

దాంతో ఆమె తన ఇద్దరు కొడుకులనూ చేరబిలిచి, తాంబూలపు తిత్తిలోంచి పది బంగారు నాణాలు బయటకు తీసింది. చెరైదు నాణాలూ కొడుకులకు ఇస్తూ "నాయనలారా! ఇవి మామూలు నాణాలు కావు. వీటిని మట్టిలో పూడ్చితే, ఒక్కో నాణెం నుండి ఒక్కో మొక్క వస్తుంది. ఆ మొక్కల్ని జాగ్రత్తగా పెంచండి- కొన్ని రోజులకల్లా ఒక్కొక్క మొక్కకూ ఒక్కొక్క గుమ్మడికాయ కాస్తుంది. ఆ గుమ్మడికాయల నిండా బంగారు నాణాలు ఉంటాయి.." అని తను మాట్లాడం ఆపి, మళ్ళీ చెప్పింది- "చూడండి బాబులూ! వీటిని మీ స్వార్థం కోసం వాడుకోవద్దండి- ఇతరులకోసం ఉపయోగిస్తే తప్ప, ఇవి మీ దగ్గర నిలవవు!" అని చెప్పి కన్ను మూసింది.

కొన్ని రోజులు గడిచాయి. పెద్దోడు ఆ ఐదు

నాణాలనూ నాటాడు. ఐదు గుమ్మడికాయలు వచ్చాయి. నాలుగు గుమ్మడి కాయల్ని ఆనాథాశ్రమాలకు, పేదవాళ్ళకు ఇచ్చేసాడు.



ఐదో గుమ్మడికాయ నాణాలని తనతోనే పెట్టుకున్నాడు. పేద పిల్లల్ని చదివించేందుకు, ఊరికి పనికొచ్చే పనులు చేసేందుకు వాటిని వాడాడు. అవి అయిపోవస్తున్నాయనగా వాటిల్లోంచి మరో ఐదు నాణాలు నాటాడు. అవి మొలకెత్తినై; మళ్ళీ నాణాలనిచ్చినై.

చిన్నోడు నాటిన ఐదు నాణాలు కూడా ఐదు గుమ్మడి కాయల్ని ఇచ్చాయి. ఐతే స్వార్థపరుడైన చిన్నోడు వాటిలోని బంగారు నాణాలని ఎవ్వరికీ ఇవ్వలేదు. వాటినన్నిటినీ నాలుగెకరాల చేనులో తిరిగి నాటాడు. అయితే ఆశ్చర్యం, ఎన్ని రోజులైనా ఏమీ కాలేదు! త్రవ్వి చూస్తే అక్కడ తను నాటిన నాణాలు కూడా లేవు!

చిన్నబోయిన చిన్నోడికి అమ్మ చెప్పిన మాటలు అప్పుడు గుర్తుకుచ్చాయి. 'ఇతరులకోసం ఉపయోగించటం' అంటే ఏంటో కొద్దిగా అర్థం అయ్యింది అతనికి. దాంతో చింతించటం మాని, తనకు చేతైనంతలో ఇతరులకు సాయం చేయటం మొదలుపెట్టాడు. అన్న మంచితనాన్ని గుర్తించి, అతనితో సఖ్యంగా ఉండటం మొదలెట్టాడు. కాల క్రమంలో అన్నాదమ్ములిద్దరూ సమాజానికి పనికొచ్చే పనులు చాలా చేసారు!

బొమ్మకు కథలు

కొత్తపల్లి 89 లో ఇచ్చిన గుహ బొమ్మ గుర్తుందా? దానికి స్పందిస్తూ అరవింద స్కూలు-కుంచనపల్లి పిల్లలు రాసి పంపిన కథల్లోంచి ఓ రెండు కథలు - ఇదిగో- చదవండి !



మంచి దొంగల కథ



దట్టమైన అడవిలో గుహ ఒకటి ఉండేది. అది ఒక సొరంగ మార్గం. గుహలాంటి ఆ సొరంగంలో కొందరు యువకులు నివసిస్తూ ఉన్నారు. నిజానికి వాళ్లు చాలా మంచివాళ్ళు. ధనవంతుల దగ్గర డబ్బులు, నగలు దోచేసి, వాటిని పేదవారికి దానం చేసేవాళ్ళు. అయితే భటులు, సైనికులు వాళ్లని దోపిడీకోరులనీ, తీవ్రవాదులనీ ముద్రవేసి, ఏదో ఒక విధంగా పట్టుకొని శిక్షించాలని శ్రమిస్తూండేవాళ్ళు.

ఈ దొంగల గుంపు ఖర్చులకోసం తమకు అనుకూలంగా ఉండే ప్రజల మీద ఆధారపడేవాళ్ళు. ఇట్లా ప్రజలు స్వచ్ఛందంగా ఇచ్చే విరాళాలను, తాము ధనికులనుండి దోచుకునే డబ్బుల్నీ రెంటినీ వాళ్ళు వేరు వేరుగా ఉంచేవాళ్ళు- వేటి లెక్కలు వాటివే.

అయితే అడవిలో బలాదూరుగా తిరిగే యువకుడొకడు, ఒకసారి వాళ్ళు గుహలోకి వెళ్ళే మార్గం కనుక్కున్నాడు. వాడు చాలా తెలివైనవాడు కూడా. గుహ ద్వారానికి అవతలగా ఉన్న చెట్టు మీద మాటు వేసి, దొంగలు అందరూ ఎప్పుడు బయటికి వెళ్తారో చూసుకున్నాడు.

ఆపైన కాపలా వాళ్లకు సందేహం రాకుండా మారువేషం వేసుకున్నాడు. దొంగలు బయటికి పోగానే, తను నేరుగా లోనికి వెళ్ళాడు; లోపల అంతా తిరిగి చూసాడు. దొంగలు గుహలో దాచిన నగల్ని, డబ్బుల్ని పూర్తిగా తీసుకెళ్ళకుండా, ఎప్పటికప్పుడు కొద్ది కొద్దిగా ఎత్తుకు పోవటం మొదలెట్టాడు. అట్లా చేస్తే దొంగలకు అనుమానం రాదనుకున్నాడు వాడు.

అయితే దొంగల నాయకుడిది సునిశితమైన బుద్ధి. తాము లెక్కపెట్టి, దాచిన తర్వాత ఆ డబ్బుల నిలవ తగ్గిపోతున్నదని అతనికి అనుమానం రానే వచ్చింది. లెక్క సరిచూసుకుంటే పెద్ద పెద్ద మొత్తాల్లోనే తేడా ఉన్నది. దాంతో అతను తన అనుచరులనందరినీ గుహముందే సమావేశపరచి "మన ఖర్చులకోసం ప్రజలు ఇచ్చిన డబ్బు సరిగానే ఉన్నది గానీ, మనం దోచుకొచ్చిన డబ్బూ, నగలూ మాత్రం రోజు రోజుకీ తగ్గిపోతున్నాయి. వాటిని 'మనకు తెలీకుండానే ఎవరో దొంగలిస్తున్నారు' అని నాకు అనుమానంగా ఉంది. వాళ్ళని ఎలాగైనా పట్టుకోవాలి. రేపు, మర్నాడు రెండు రోజులూ ఇక్కడ మాటు వేసి ఉండండి. మూడో రోజునుండీ వారం పాటు మనం ఇక్కడ ఉండము కదా, ఎలాగూ?!" అన్నాడు.

ఈ మాటల్ని కూడా చాటుగా విన్నాడు యువకుడు.



ఆ తర్వాత రెండు రోజుల పాటు దొంగలు ఆ చుట్టు ప్రక్కల అంతా మాటు వేసి ఉన్నారు యువకుడికోసం. కానీ తెలివిగల యువకుడు ఆ రెండు రోజులు అటుకేసి తిరిగి కూడా చూడలేదు. చూసి చూసి వేసారిన దొంగలు నాయకుడి దగ్గరికి వెళ్ళి, "మన ప్రయత్నం ఫలించలేదు. ఇప్పుడు మనం వారం రోజుల పాటు బయటికి వెళ్ళామంటే మనం దోచుకున్న

డబ్బులు, నగలు అన్నీ ఆ దొంగ పాలు అయిపోతాయి" అన్నారు.

దొంగల నాయకుడు చిన్నగా నవ్వి- "మనం ఎక్కడికీ వెళ్ళట్లేదు. అందరం ఈ రెండు రోజులూ గుహలోనే ఉంటాం" అన్నాడు. దొంగలకు అతని పథకం అర్థమైంది. వాళ్ళు అనుకున్నట్లు గానే తర్వాతి రోజున బలాదూరు యువకుడు వచ్చాడు. గుహముందు ఎవ్వరూ కనిపించకపోవటంతో ఏమరపాటుగా గుహలోకి ప్రవేశించాడు; వాడికోసమే ఎదురు చూస్తున్న దొంగలకు దొరికిపోయాడు.

దొంగల నాయకుడు వాడితో "ఒరే నీకు ఎంత ధైర్యం ఉంటే మా దగ్గరే నగలు డబ్బు దోచుకుంటావు?! అదంతా పేద ప్రజలకు చెందాల్సిన డబ్బు. దాన్నంతా మర్యాదగా తిరిగి ఇచ్చెయ్యి" అన్నాడు.

బలాదూరు యువకుడు డబ్బు నగలు తిరిగి ఇచ్చి "అయ్యా నన్ను క్షమించండి. నేను ఏదో దురుసు తనంతోటి ఈ డబ్బును దోచుకున్నానుగానీ, అటు తర్వాత చాలా పశ్చాత్తాప పడ్డాను. మీరు చేస్తున్న మంచి పనులు నాకు తెలుసు. నన్నూ మీలో ఒకడిగా ఉండనివ్వండి" అన్నాడు.

దొంగల నాయకుడు ఒక క్షణం ఆలోచించి, 'సరే'నన్నాడు.

రచన: శరణ్య, ఎనిమిదవ తరగతి, అరవింద స్కూల్

సారంగం కథ

కోసల రాజ్యం, శృంగరాజ్యం రెండూ ఇరుగు పొరుగు రాజ్యాలు. కోసల రాజు శాంతవర్మ ఉత్తముడూ, సౌమ్యుడున్నూ. ప్రజాక్షేమం కోరి, జనరంజకంగా పరిపాలించేవాడు. ఇక శృంగ రాజ్యాధిపతి గుణసేనుడు క్రూరుడు. అతని రాజ్యంలో హింస, కటుత్వం అధికంగా ఉండేవి. శాంతవర్మని ఏమీ చేతకాని చవటగానూ, దద్దమ్మగానూ భావించిన గుణసేనుడు, ఒకసారి

కేవలం రాజ్యకాంక్షతో కోసల మీదికి దండెత్తాడు. దీనికి ప్రేరణనిచ్చింది రణధీరుడనే గూఢచారి:

రణధీరుడు ఒకసారి మారువేషంలో కోసల సమీపంలోని అడవిలో తిరుగుతూ, ఆసక్తికరమైన దృశ్యాన్నొకదాన్ని గమనించాడు. కోసల రాజు శాంతవర్మ, మరి కొందరు సైనికులు సాధారణ పౌరుల మాదిరి దుస్తులు ధరించి, ఒక గుహముందు నిలబడి ఉన్నారు. శాంతవర్మ పురమాయించగా ఆ సైనికులు గుహకు అడ్డుగా ఉన్న బండనొకదాన్ని తొలగించారు. ఆపైన అందరూ గుహలోకి వెళ్ళి బండను తిరిగి అడ్డుగా నిలిపారు. అటుపైన ఆ రోజంతా ఎవ్వరూ బయటికి రాలేదు!



వాకబు చేసిన రణధీరుడికి చాలా ముఖ్యమైన సైన్య రహస్యం ఒకటి తెలిసింది: గుహనుండి కోసల రాజ భవనానికి ఒక సొరంగ మార్గం ఉన్నది. శాంతవర్మ, అతని ముఖ్య అనుచరులు మాత్రమే ఆ మార్గాన్ని వాడతారు. ప్రజల కష్టసుఖాలను కనుగొనేందుకు నెలకొకసారి ఆ మార్గాన్ని ఉపయోగిస్తుంటాడు శాంతవర్మ.

దాన్ని ఉపయోగించుకుంటే శృంగరాజ్య సైన్యాలు సునాయాసంగా కోసల రాజ భవనానికి చేరుకోగలవని, కోసల రాజ్యం తమ పరం అయిపోతుందనీ ఊహించిన రణధీరుడు, ఆ రహస్యాన్ని తమ రాజుకు చేరవేసాడు. తక్షణం యుద్ధం ప్రకటించాడు గుణసేనుడు. మరుసటి రోజుకల్లా శృంగరాజ్య సైన్యాలు కోసల రాజ్యపుటంచుల్లో మోహరించాయి.

'జననష్టం కలిగించే యుద్ధం వద్దం'టూ సంధి ప్రతిపాదనలు పంపాడు శాంతవర్మ. ఐతే

గుణవర్మ దానికి అంగీకరించలేదు. ఏది ఏమైనా యుద్ధం తప్పదని, కాపాడుకోవటం చేతకాకుంటే కోసలను అప్పగించి ప్రాణాలు కాపాడుకొమ్మనీ కబురంపాడు.




యుద్ధం తప్పదని గ్రహించిన శాంతివర్మ తమ సైనికులతోటీ, ప్రజా ప్రతినిధులతోటీ మాట్లాడి, వారిలో ఉత్తేజం నింపాడు. "విజయమా! వీరమరణమా!!" అని అతనిచ్చిన సందేశం సైనికులందరిలోనూ ఆవేశాన్ని రగిలించింది. "ప్రతి కోసల పౌరుడూ ఒక వీర సైనికుడు" అంటూ శృంగ రాజ్య సైన్యాలను ఊరూరా ఎదుర్కొనే వ్యూహాన్ని రచించారు కోసల ప్రజలు.

దండయాత్రలో భాగంగా కోసలలోకి ప్రవేశించబోయిన శృంగరాజ్య సైన్యాలకు అడుగడుగునా ఆటంకాలు ఎదురయ్యాయి. చివరికి ఎలాగో ఒకలాగా గుహ ముఖద్వారాన్ని చేరుకున్న సైన్యం యావత్తూ రణధీరుడి ప్రోత్సాహంతో చకచకా గుహలోకి ప్రవేశించింది. "ఇట్లా దూరి అట్లా తేలతాం, కోసల రాజ భవనంలో!" అనుకుని, గుణసేనుడితో సహా అందరూ ఉత్సాహంగా లోనికి దూరి, గుహ తలుపులు మూసారో, లేదో- అన్నివైపులనుండీ బాణాల వర్షం కురిసింది. బయటికి వెళ్ళే దారి దొరకక, బాణవర్షాన్ని ఎదుర్కోలేక, శృంగ రాజ్య సైన్యం మొత్తం అంతరించిపోయింది!

అటుపైన శాంతి వర్మ పాలనలో రెండు రాజ్యాలూ ప్రగతి బాట పట్టాయి!!

వి. వంశీ కృష్ణ, ఎనిమిదవ తరగతి.



చిన్నోడు-జమీందారు కూతురు

మూలం : ఆంగ్ల జానపద కథ

సేకరణ, అనుసరణ: రవితేజ, 6 వ తరగతి, వికాస విద్యావనం, పోరంకి, విజయవాడ, కృష్ణాజిల్లా.

అనగనగా ఒక ఊళ్లో రాము, సోము, రాజు అనే ముగ్గురు అన్నదమ్ములు ఉండేవారు. వాళ్ళలో అన్నలు రాము, సోము ఒక జట్టుగా ఉండేవాళ్ళు. ఒంటరిగా, తనే 'రాజు' అన్నట్లు సంతోషంగా ఉండే తమ్ముడు రాజు అంటే వాళ్ళిద్దరికీ అస్సలు ఇష్టం ఉండేది కాదు.

ఒక రోజు వాళ్ల నాన్న పొలం పనికి వెళ్ళాడు- చూడగా ముందు రోజు రాత్రి ఎవరో దొంగలు పైరు కోసినట్లు అనిపించింది.

ఆయన ఇంటికి వెళ్ళి కొడుకులు ముగ్గురినీ పిలిచి, "ఒరే! పిల్లలూ! పగలంతా పొలంలో

ఉండీ ఉండీ అలిసి పోయి వస్తాను. మళ్ళీ రాత్రిపూట కూడా కాపలా కాయాలంటే నా వల్ల కాదు. ఇకనుండీ మీరు రాత్రిళ్లలో కాపలాకు వంతులు వేసుకోండి. మన పైరును కోస్తున్న దొంగ ఎవరో కనిపెట్టండి" అన్నాడు.



"నీకెందుకు నాన్నా! నేనున్నాను కదా" అన్నాడు పెద్ద కొడుకు రాము. ఆ రోజు రాత్రి చీకటి పడుతూండగానే అతను పొలానికి వెళ్ళాడు గానీ, అక్కడ వీచే చల్లటి గాలికి ఒక్క గంట సేపు కూడా మేలుకొని ఉండలేకపోయాడు. అతను అట్లా ఒకవైపున హాయిగా నిద్రపోతుంటే ఎవరో దొంగలు వచ్చి పొలంలో మరో చెక్కను కోసేసుకున్నారు.

పొద్దునే అతను నిద్రలేచి ఇంటికి వెళ్ళి "నేను రాత్రి ఒక్క కునుకు కూడా తీయలేదు- కానీ ఏం మాయో ఏమో, ఎవరో కొరికినట్లు పొలం ఒక మూలంతా నలిగి ఉంది" అన్నాడు. వాళ్ల నాన్న వాడిని తిట్టి తిట్టి అలసిపోయి ఊరుకున్నాడు.

రెండో రాత్రి కాగానే రెండో వాడు సోము-తను కూడా అన్న లాగే "నీకెందుకు నాన్నా! నేనున్నాను కదా!" అంటూ కడుపునిండా అన్నం తిని పొలానికి చేరుకున్నాడు. పొలంలో ఒక మూలన మంచె కట్టుకొని కూర్చున్నాడు. నిద్ర రాకుండా కళ్ళకు పెట్టుకునేందుకు కొన్ని క్లిప్పులు కూడా వెంట తీసుకెళ్ళాడతను. కానీ వాటిని వేటినీ వాడకనే మరి, ఎప్పుడు పడుకున్నాడో, పడుకుని నిద్రపోయాడు! ఆ రోజున పొలం

ఇంకొంచెం నలిగింది.

మూడో రాత్రి వచ్చింది. "నీవల్ల ఏమౌతుందిలే రాజూ! నాన్ననే పోనివ్వు" అన్నారు అన్నలిద్దరూనూ. అయినా రాజు వాళ్ల నాన్నతో చెప్పి పొలానికి బయలు దేరి పోయాడు. ఒక కజ్జికాయ, కొన్ని మురుకులు జేబులో పెట్టుకొని పోయి, నిద్రవచ్చినప్పుడల్లా ఒక్కో ముక్క కొరుకుతూ కూర్చున్నాడు. అంతలోనే ఎవరో పైరు దగ్గరకు వస్తున్న శబ్దం వినిపించింది. "ఎవరా?!" అని బయటికి వెళితే ఎవరో మరుగుజ్జు మనిషి ఒకడు వంగుని పైరు కోస్తున్నాడు!

అప్పుడు రాజు పరిగెత్తుకుంటూ వెళ్ళి అతని కాళ్ళు పట్టేసుకున్నాడు. "నన్ను వదిలెయ్! నన్ను వదిలెయ్! ఇంక నేను నీ పైరు కొయ్యను- నన్నొదిలి పెట్టు!" అని మొత్తుకున్నాడు మరుగుజ్జు వాడు.

"సరేలే పాపం! పొట్టివాడు" అని వదిలి పెట్టాడు రాజు.

అప్పుడు ఆ మరుగుజ్జువాడు సంతోషపడి, రాజుకి పది బంగారు నాణాలు ఇచ్చి, "నిన్ను అడక్కుండానే మీ పొలంలోంచి పైరు కోసినందుకుగాను ఇవిగో, ఇవి మీకు!" అన్నాడు. "అంతేకాదు- నేను అడగగానే నన్ను వదిలేసావు కదా, అందుకని మనిద్దరం ఇప్పుడు స్నేహితులం ఐపోయాం! నీకు ఎప్పుడైనా నా సాయం కావాలంటే ఇదిగో, ఈ ఉంగరాన్ని రుద్ది, 'చీంచాంచాంచీంబుష్' అంటే చాలు- నేను నీ ముందు ప్రత్యక్షమౌతాను!" అని చెప్పి బుడుంగున మాయమైపోయాడు.

"మన ఊరి జమీందారుకు మన పైరు చాలా నచ్చిందట. వాళ్ల మనిషి ఎవరో వచ్చి పైరు కోసుకుంటున్నాడు. నన్ను చూసి, ఇదిగో ఈ ఐదు బంగారు నాణాలు ఇచ్చి పోయాడు" అని ఆ డబ్బుల్ని వాళ్ల నాన్న చేతిలో పెట్టాడు రాజు. నాన్న రాజుని మెచ్చుకున్నాడు గానీ, అన్నలిద్దరికీ వాడంటే ఇంకా చాలా కోపం వచ్చింది.

అంతలో వాళ్ల ఊరి జమీందారు టముకు

వేపించాడు: అదేమిటంటే, "నా కూతురు ఒక ఒంటి స్తంభం భవనంలో కూర్చొని, అద్దంలో నించి బయటికి చూస్తూ ఉంటుంది. తన వేలికి ఒక వజ్రాల ఉంగరం ఉంటుంది. గుర్రంమీదెక్కి వచ్చి ఎగ్గిరి దూకి ఆ ఉంగరాన్ని ఎవరైతే అందుకుంటారో వాళ్ళకి నా కూతురినిచ్చి పెళ్ళి చేస్తాను" అని.

జమీందారు కూతురంటే అందరికీ ఇష్టమే కదా, అందుకని ఊళ్లలో పెళ్ళికాని కుర్రవాళ్ళు అందరూ బయలుదేరి పోయారు. రాము, సీను కూడా గుర్రాలెక్కి బయలుదేరారు, పోటీలో పాల్గొనేందుకు.

"అన్నలూ! నాకు కూడా ఒక గుర్రాన్నివ్వరూ?!" అని అడిగాడు రాజు. కానీ వాళ్ళిద్దరూ వెటకారంగా నవ్వారు. "నీకెందుకురా?! జమీందారు కూతురుతో నీకేం పని?! నీ మురికి బట్టలు చూస్తే అక్కడికి ఎవ్వరూ రానివ్వరు అసలు. నువ్వు పొలంలో దొంగల్ని పట్టుకుంటూండు, మేం పోయి జమీందారు కూతురుని పెళ్ళి చేసుకొస్తాం" అని ఇకిలిస్తూ, వాడికి గుర్రాన్ని ఇవ్వకుండానే వెళ్ళి పోయారు.



కాసేపు ఆగాక రాజుకి ఒక ఐడియా వచ్చింది. "నాన్నా! నేను పుట్టగొడుగులు ఏరుకొస్తాను" అని చెప్పి, పొలంలోకి వెళ్ళి 'చీంచాంచాంచీంబుష్' అన్నాడు.

అంతే! మరుగుజ్జు మనిషి ప్రత్యక్షమయ్యాడు. "నమస్తే రాజూ! ఏం కావాలి నీకు?" అన్నాడు.

"నాకు ఒక జత రాజుల్లాంటి మంచి బట్టలు, ఒక మంచి పంచకల్యాణి గుర్రం కావాలి- ఇవ్వగలవా?" అన్నాడు రాజు.

"ఓఁ తప్పకుండా ఇస్తా.. దానిదేముంది?" అని మరుగుజ్జువాడు చేతులు తిప్పగానే అవి ప్రత్యక్షం అయ్యాయి.

రాజు మరుగుజ్జుకు ధన్యవాడాలు చెప్పుకొని, ఆ బట్టలు వేసుకొని గుర్రం మీద జమీందారు దగ్గరికి బయలుదేరి పోయాడు.

అక్కడ చేరినవాళ్లంతా ధగధగా మెరిసిపోతున్న రాజుని చూసి 'ఎవరో రాజకుమారుడులా ఉన్నాడు- ఈ గుర్రం పంచకల్యాణి కావచ్చు- బలే ఉంది' అనుకున్నారు. వాడిని రాము, సీను కూడా గుర్తు పట్టలేదు!

కొంచెం సేపటికి పోటీ మొదలైంది. జమీందారు కూతురు ఒంటి స్తంభం మేడ మీద కూర్చుని, అద్దంలోంచి బయటికి చూస్తున్నది. ఆమె చేతులు మటుకు కిటికీలోంచి బయటికి పెట్టింది. దూరంనుండి పరుగెత్తుకొని వచ్చి, గుర్రాన్ని ఎగిరించి, ఆమె వేలికి ఉన్న ఉంగరాన్ని అందుకోవాలి!

అది వినగానే అక్కడ చేరిన యువకులందరూ చప్పగా అయిపోయారు. వాళ్లంతా గుర్రాల్ని దూకించారు గానీ, ఎవ్వరూ అంత ఎత్తుకు ఎగరనే లేక పోయారు. చివరికి, మన రాజు లేచి, పంచకల్యాణి వీపు నిమిరి, వేగంగా పరుగు పెట్టించాడు. మెరుపు వేగపు ఆ గుర్రం తటాలున కిటికీ అంత ఎత్తుకు ఎగిరింది! దాని మీద హుందాగా కూర్చున్న రాజు జమీందారు కూతురు చేతికున్న ఉంగరాన్ని సున్నితంగా అందుకొని, ఈక దిగినట్లు అలవోకగా నేలమీదికి దిగాడు! చూస్తూన్నవాళ్లంతా ఆశ్చర్యంతో చప్పట్లు చరిచారు.

అట్లా జమీందారు కూతుర్ని పెళ్ళి చేసుకున్న రాజు కొంతకాలానికి తనే జమీందారు అయ్యాడు. మంచి పేరు తెచ్చుకున్నాడు.



కృతజ్ఞత

సేకరణ, కథనం: ఆర్. అఖిల, ఏడవ తరగతి, బ్రిలియంట్ పబ్లిక్ స్కూల్, జహీరాబాద్

అనగనగా ఒక అడవి అంచున 'అశ్వరాజపురం' అనే ఊరు ఒకటి ఉండేది. ఒకసారి ఆ అడవిలో తిరిగే గుర్రం పిల్ల ఒకటి, తన తల్లి నుండి విడిపోయి, ఒక్కతే నడుచుకుంటూ ఆ ఊళ్లోకి వచ్చింది. గ్రామస్తులకు ఆ గుర్రపు పిల్ల చాలా నచ్చింది. వాళ్ళందరూ దాన్ని దయతో సాకారు. వంతులవారీగా ఆహారం పెట్టి, పెంచారు. దాన్ని ఎవ్వరూ ఏమీ అనేవాళ్ళు కాదు. అది ఆ ఊరంతా తిరుగుతూ, అందరినీ శ్రద్ధగా గమనిస్తూ ఉండేది.

ఒకసారి బందిపోటు దొంగలు కొందరు ఆ ఊరిని దోచుకునేందుకు పథకం వేసారు. భిక్షగాళ్ల వేషాలు వేసుకొని, పగలంతా ఊళ్ళో తిరిగారు.



అట్లా తిరుగుతూ ఊరి తీరు తెన్నుల్నీ, వీధుల్నీ, దారుల్నీ, ఊరి సంపదనీ అంచనా వేసుకున్నారు.

ఎన్నడూ లేనిది ఇంత మంది బిచ్చగాళ్ళు వచ్చి హడావిడిగా తిరగటాన్ని చూసి ఊళ్ళో ఒక ముసలాయనకు అనుమానం వచ్చింది. వాళ్లు వెళ్లిపోయాక, ఆయన ఊళ్ళోవాళ్లందరినీ పిలిచి, "నాకెందుకో అనుమానంగా ఉంది.. ఊళ్లోకి ఒక్కసారిగా ఇంతమంది బిచ్చగాళ్ళు రావటం చూస్తే, ఇదంతా బందిపోట్ల పనేమో అనిపిస్తోంది. ఏది ఏమైనా మనం అందరం ఈ రెండు మూడు రోజులూ బాగా మెలకువగా ఉండాలి" అని చెప్పాడు.

ఊళ్ళో జనాలు భయపడ్డారు: "వాళ్లని మనం ఏం ఎదిరించగలం? వాళ్ల దగ్గర ఏవేవో ఆయుధాలు ఉంటాయాయె" అని, ఎవరికి వాళ్ళు ఊరి విడిచి పెట్టి పోయేందుకు ఏర్పాట్లు చేసుకోసాగారు.

ఇదంతా చూసిన ఆ గుర్రం కలవర పడింది. ఇన్నాళ్ళూ తనను ప్రేమగా సాకిన ఆ ఊరివాళ్లని ఎలాగైనా కాపాడాలనుకున్నది. రాత్రి కాగానే ఊరి పొలిమేరల్లో అంతటా

టకటకా తిరగటం మొదలు పెట్టింది.



ఆ రోజు రాత్రి దోచుకునేందుకు వచ్చిన బందిపోటు దొంగలు దూరం నుండే గుర్రపు డెక్కల చప్పుడు విన్నారు- "రాజసైనికులు పహరా కాస్తున్నారల్లే ఉంది. దొరికితే మన పని అంతే!" అని భయపడి, అటు నుండి అటే వెళ్లిపోయారు. అట్లా కొన్నాళ్ల పాటు ప్రతి రోజూ వాళ్ళు రావటం, గుర్రపు డెక్కల చప్పుడు విని వెనక్కి పోవటం జరిగింది. చివరికి విసుగొచ్చి, వాళ్ళు వేరే వైపుకు బయలుదేరి పోయారు! అట్లా గుర్రం తనను సాకిన ఊరి రుణం తీర్చుకున్నది!

స్వాగతం!

కొత్తపల్లిలో పిల్లల రచనలకు ప్రాధాన్యత ఉంటుంది. ఈ పుస్తకంలో దాదాపు సగం కథలు పిల్లలు రాసినవి; మిగిలినవి పిల్లలకోసం పెద్దలు రాసినవి. బొమ్మలు వేసిన వాళ్ళు మటుకు యువకులు. పిల్లలను కలవటం, వాళ్లతో తెలుగులో కథలు రాయించటం, బొమ్మలు వేయించటం, వాళ్ళు పంపిన కథల్ని, బొమ్మల్ని సరిదిద్ది మిగతా పిల్లలందరికీ నచ్చేట్లు పుస్తకాలుగా తయారు చేయటం, దానికోసం ఓపెన్ సోర్సు ఉపకరణాలను వాడటం, కథల్ని అందరూ ఉచితంగా చదువుకునేట్లు ఇంటర్నెట్‌లో పెట్టటంతోపాటు, కొన్ని ప్రతులు అచ్చు వేయటం మాకు ఇష్టం. అందరి మేలూ కోరి చేసే ఈ పనిలో మీరూ పాలుపంచుకోండి. పిల్లల కథల ప్రపంచానికి స్వాగతం !



మాట్లాడే పుర్రె

కొన్ని కథలు ఇదిగో, ఇట్లా గందరగోళంగా ఉంటాయి...!

సేకరణ, కథనం: అజయ్, రిషివ్యాలీ స్కూల్

ఒకసారి ఓ వేటగాడు అడవిలో తిరుగుతూ ఒక పొదను చూసాడు.

ఆ పొద మాటున అతనికి ఒక పుర్రె కనబడింది.

వేటగాడు పుర్రెను చేతిలో పట్టుకొని తిప్పుతూ "ఆశ్చర్యంగా ఉందే! ఇక్కడ ఎముకలు ఏమీ లేవు; ఒట్టి పుర్రె మాత్రం ఉంది! ఇది ఎలా సాధ్యం?"అనుకొంటూ, ఊరికనే "నిన్ను ఇక్కడికి ఎవరు తెచ్చారు, పుర్రే?!"అని అడిగాడు.

ఆశ్చర్యంగా, ఆ పుర్రె మాట్లాడింది: "నన్ను మాటలే తెచ్చాయి, ఇక్కడికి!" అన్నది.

వేటగాడు భయంతో వణికి పోయాడు. పుర్రెను తటాలున ఆ పొదలోకే విసిరేసి, వగర్చుకుంటూ అడవికి అడ్డం పడి పరుగు పెట్టాడు.

అట్లా పోయిన వాడు నిండు సభలో కొలువు దీరి ఉన్న రాజుగారి దగ్గరికి చేరుకునే వరకూ ఆగలేదు. ఏవేవో రాజ్య వ్యవహారాలతో తలనొప్పిగా ఉన్న రాజు అతన్ని చూసి "సంగతేంటి?" అని అడిగాడు.

వేటగాడు ఆయన దగ్గరికి పోయి నిలబడి గుసగుసగా చెప్పాడు: "అయ్యా! నేను మా ఊరి ప్రక్కనున్న అడవిలో ఇందాకే ఒక పుర్రెను చూసాను. ఎండిపోయిన మనిషి పుర్రె అది. ఒక పొదలో ఇరుక్కుని ఉండింది. నేను దాన్ని చేతిలో పట్టుకోగానే అది మాట్లాడింది: తమరి గురించి అడిగింది! తమరి తల్లిదండ్రులెలా ఉన్నారని అడిగింది! దాంతో నాకు భయం వేసింది. దాన్ని అక్కడే పడేసి నేరుగా తమరి దగ్గరికి వచ్చేసాను. దయచేసి తమరు నాతో రండి. ఆ పుర్రె సంగతేదో తేల్చండి" అని.

రాజు గారికి చికాకు వేసింది. ఆయన అనుకున్నాడు "నాకు తెలివి వచ్చిన నాటినుండి ఎవ్వరూ ఇట్లాంటి చెత్త కబురు పట్టుకొని నా ముందుకు రాలేదు. పుర్రె మాట్లాడుతున్నదని ఇంత ఉషారుగా చెప్పిన వాడు ఒక్కడూ లేడు. వీడొక్కడికే అంత ధైర్యం, అంత తెగువ!" అని.

బయటికి మాత్రం ఆశ్చర్యం ప్రకటించి "అవునా?!" అన్నాడు. అని, వెంటనే ఇద్దరు సైనికులను పిలిచి వేటగాడిని చూపిస్తూ, "ఇదిగో, ఈ వేటగాడు 'పుర్రె మాట్లాడింది' అని చెబుతున్నాడు. ఇతని వెంట వెళ్ళండి. ఇతను చెప్పింది నిజమైతే తనను ఇంటికి పంపించి, ఆ పుర్రెనేదో ఇక్కడికి పట్టుకు రండి. లేకుంటే వీడిని చంపేసి అక్కడే పడేయండి" అన్నాడు.

సైనికులిద్దరినీ వెంట బెట్టుకొని వేటగాడు అడవిలో తనతో మాట్లాడిన పుర్రె దగ్గరికి వచ్చాడు. "మాట్లాడు, పుర్రే! నిన్ను ఇక్కడికి ఎవరు తెచ్చారు?" అన్నాడు. పుర్రె చప్పుడు చేయలేదు. వేటగాడు ఎన్ని రకాలుగా

అడిగినా, ఎంత ప్రాధేయపడినా, ఇక అది నోరు విప్పనే లేదు!

సైనికులు ఇద్దరూ వేటగాడికేసి జాలిగా చూసారు. కొద్ది సేపు తటపటాయించినా, చివరికి వాళ్ళలోని రాజభక్తే గెలిచింది. వేటగాడిని అక్కడికక్కడే చంపి పడేసారు.

కొన్ని ఏళ్ళ తరువాత వేరే ఒక వేటగాడు.. మళ్ళీ ఆ పొద దగ్గరికే వచ్చాడు... పుర్రెని చూసాడు... ఆశ్చర్యపోయాడు..

తను కూడా పుర్రెని అదే ప్రశ్న వేశాడు. "నిన్ను ఇక్కడికి ఎవరు తెచ్చారు పుర్రే?!" అని.

ఆశ్చర్యంగా, వేటగాడి పుర్రె నోరు విప్పింది: "నన్ను మాటలే ఇక్కడికి తెచ్చాయి" అన్నది...!

ఇంగ్లీషు మీడియం!

డాక్టర్: బాబూ! ఏది నీ నోరు చూపించు అ, ఆ.. అను"

పక్కనే ఉన్న తండ్రి: "మా వాడు ఇంగ్లీషు మీడియం అండీ అ, ఆలు రావు.

నవ్వు!

నిద్ర ఎక్కడ?

సుబ్బారావు: డాక్టర్ గారూ.. ఈ మధ్య సరిగా నిద్ర పట్టడం లేదు. మంచి మందులేమైనా..


డాక్టర్: చూడండి.. నిద్ర పట్టడానికి మంచి వాతావరణం అవసరం. చక్కని మెత్తటి పరుపు, ఎత్తైన దిండ్లు, సుగంధ భరితమైన అగరుబత్తి పొగలు, నీలం రంగు కాంతి బల్బు, కిటికీలు మంచి కర్టెన్లు వేసుకుంటే నిద్ర దానంతట అదే వస్తుంది.

సుబ్బారావు: కానీ అఫీసులో ఇన్ని వసతులు ఏర్పాటు చేసుకోవడానికి వీలు కాదేమో డాక్టర్...

మనల్ని మనం ద్వేషించకోకుండా ఉండటమే మన ప్రథమ కర్తవ్యం. ఎందుకంటే, అభివృద్ధి చెందాలంటే మొదటగా కావలసింది ఆత్మవిశ్వాసం.

సూక్తి!

-వివేకానందుడు



పారని యుక్తి

బద్ధకపు సింహాలు అతి తెలివికి పోతే ఇట్లానే అవుతుంది- తెలివైన ఏనుగులు, ఎలుగుబంట్లు వాటికి బుద్ధి చెప్పాల్సి వస్తుంది.

అనగనగా ఒక అడవిలో ఒక సింహం ఉండేది. అది చాలా పొగరుబోతుది, బద్ధకపుది కూడాను. ఒకరోజున అది తీరికగా కూర్చొని ఆలోచిస్తూంటే గొప్ప ఆలోచన ఒకటి వచ్చింది దానికి. వెంటనే అది అడవిలోని జంతువులన్నిటితోటీ సమావేశం ఏర్పాటు చేసింది.

గుంపు కూడిన జంతువులతో చెప్పింది: "ఒకవైపున నేను మీ అందరికీ రాజుగా ఉంటూ, మరోవైపున మిమ్మల్నే తినటం అదోలా అనిపిస్తున్నది. అందుకని నేను ఇందాకే ఒక నిర్ణయం తీసుకున్నాను. ఇకమీద నేను ఎన్నడూ మాంసం ముట్టను. అంతేకాదు- ఇవాల్టి నుండి మన

అడవిలో వేటను పూర్తిగా నిషేధిస్తున్నాను. మీరంతా సుఖంగా, ప్రశాంతంగా బ్రతకొచ్చు" అంటూ సభను ముగించింది.



వెర్రి జంతువులన్నీ చప్పట్లు కొట్టి పండగ చేసుకున్నాయి. "ఇవాల్టినుండి అడవిలో స్వాతంత్ర్యం" అని చెప్పుకున్నాయి.

అక్కడినుండి గుహకు చేరగానే సింహం తన మంత్రి నక్క వైపుకు తిరిగింది- "పో- ఏవైనా మాయమాటలు చెప్పి, ఇక్కడికి దగ్గర్లో కనబడ్డ జంతువు దేన్నైనా ఆహారంగా తీసుకురా!" అన్నది.

"కానీ, ప్రభూ! మీరు, శాకాహారం.." అని గొణిగిన నక్క, దాని కేసి చూస్తూనే మాట మార్చి, "సరే ప్రభూ! తమరు ఎట్లా అంటే అట్లా చేద్దాం. ఏదైనా జంతువును పిల్చుకొచ్చి, ఆనక మిమ్మల్ని కలుస్తాను" అంటూ బయటికి పోయింది.

ఆ రోజున దానికి గుహ దగ్గర్లోనే జింక ఒకటి కనబడింది. దానికి మాయమాటలు చెప్పి, గుహ ముందుకు తీసుకొచ్చి 'రాజా' అని పిలిచింది నక్క. సింహం గబుక్కున బయటికి దూకి, ఒక్క దెబ్బకు దాన్ని చంపేసి, గుహలోకి ఈడ్చుకుపోయింది. అది తినగా మిగిలిన మాంసం ముక్కల్ని నక్క సంతోషంగా మెక్కింది.

ఇట్లా ఎవ్వరికీ అనుమానం రాకుండా రోజుకో జంతువును చంపి తినటం మొదలు పెట్టాయి, సింహం-నక్క.

అయితే, చచ్చిపోయిన ఆ జింకకు రెండు స్నేహితులు ఉండేవి- ఎలుగు బంటి, ఏనుగు. మాయమైన జింక కోసం అవి రెండూ వెతకటం మొదలు పెట్టాయి. చివరికి సింహం ఉండే గుహకు దగ్గర్లో వాటికి జింక ఎముకల కుప్ప కనిపించింది. దాంతో

వాటికి సింహం మీద, ఎప్పుడూ సింహం తోకలాగా తిరిగే నక్క మీద అనుమానం వచ్చింది.

ఆ రోజు సాయంత్రం సమయంలో అవి రెండూ సింహం గుహకి దగ్గర్లో మాటు వేసాయి. అంతలోకే నక్క సరదాగా కబుర్లు చెప్పుకుంటూ ఒక జంతువును వెంట తీసుకురావడం, గుహ బయట నిలబడి 'రాజా' అని పిలవటం, క్షణాల్లో సింహం బయటికి దూకి ఆ జంతువును చంపి, గుహలోకి ఈడ్చుకెళ్ళటం మొత్తం చూసాయి.

"వామ్మో! ఇవి ఎంత మోసపువి?! బయటికేమో మాంసం మానేసామని చెప్పుకుంటూ, లోపల్లోపల ఎట్లాంటి పని చేస్తున్నాయో చూడు-" అనుకొని అవి రెండూ అడవిలోకి జారుకున్నాయి.

మరుసటి రోజు సాయంత్రం అవి గుహ వైపుకు పోతుంటే, దూరంగా నక్క ఉషారుగా ఈల వేసుకుంటూ రావటం కనిపించింది. దాన్ని చూడగానే ఏనుగు కనుసైగ చేసి, తను ఓ చెట్టు ప్రక్కకు పోయి గడ్డి మేస్తున్నట్లు నటించటం మొదలు పెట్టింది. ఎలుగుబంటి తను ఒక్కతే వచ్చినట్లు, రోడ్డు వెంబడి ముందుకు సాగింది.



నక్క ఎలుగు బంటిని చూస్తూనే "ఏం మామా?! ఇటు వచ్చావు? సింహం రాజుని కలిసే పని ఏదైనా ఉందా?" అని పలకరించ బోయింది. అయితే దాన్ని చూడగానే కోపం నసాళానికంటిన ఎలుగుబంటి దానిమీదికి దూకి, కసిగా చంపేసింది.

ఆ తర్వాత ఏనుగు, ఎలుగుబంటి రెండూ కలిసి దాన్ని ఓ మూలకు ఈడ్చుకు పోయినై; తాము ముందుగానే తయారు

చేసి తెచ్చుకున్న విషపు ఆకుల రసాన్ని దాని నోట్లో పిండినై; ఆ ముద్దను దాని గొంతులోకి కూరినై; చివరికి దాని శరీరాన్ని సింహం గుహ ద్వారం దగ్గరికి తీసుకెళ్ళి పడేసినై.

ఆలోగా గుహ లోపల సింహానికి చాలా ఆకలి వేసింది. ఎంతకీ తిరిగిరాని నక్కమీద చాలా కోపం కూడా వచ్చింది. చివరికి అది కోపంతో మండిపోతూ గుహలోంచి బయటికి వచ్చింది. ముఖద్వారం లోనే దానికి నక్క శరీరం కనిపించింది. మామూలుగా సింహం చనిపోయిన జంతువుల్ని తినదు; కానీ బాగా ఆకలితో ఉండటం వల్లనో ఏమో, అది చక చకా నక్కను గుహలోకి ఈడ్చుకు పోయి ఆబగా తినేసింది. ఇంకేముంది? విషపు ఆకుల ప్రభావంతో కొద్ది సేపటికి అది కూడా తన్నుకులాడి చనిపోయింది.

సంగతి తెలుసుకున్న జంతువులన్నీ సంతోష పడ్డాయి, "ఊరికే ఎవ్వరి మాటల్నీ గుడ్డిగా నమ్మకూడదు" అని తెలుసుకున్నాయి.

దేవుడి బొమ్మ!

టీచర్: పిల్లలూ! మీకు నచ్చిన దేవుడి బొమ్మ గీసి చూపించండి.

రాము (తెల్లకాగితం ఇస్తూ): ఇదిగో టీచర్! నేనే ఫస్టు!

టీచర్: వెరీగుడ్! కానీ ఇందులో ఏమీ కనిపించడం లేదే...?!

రాము: దేవుడు కంటికి కనిపించడని మీరే చెప్పారుగా టీచర్?!

నవ్వు!

సగం పాసు!

అక్క: అదేంట్రా...రెండూ ఒకే రకం పుస్తకాలు కొన్నా వెందుకు?

తమ్ముడు: ఈ పుస్తకం చేతిలో ఉంటే సగం పరీక్షలు పాసైనట్లే అని రాసుంది. అందుకే రెండు కొన్నాను.

అక్క: అబ్బో నీకు ఎన్ని తెలివితేటలు రా!!



పారిపోయిన రంగడు

రచన: వి. శ్రావణి, ఎనిమిదవ తరగతి, యుపి స్కూల్, కంకణాల పల్లి, ప్రకాశం జిల్లా.

ధర్మవరంలో సీత-రాముడు అనే భార్యాభర్తలు ఉండేవాళ్ళు. కొన్ని తరాల పాటు కూర్చొని తిన్నా తరగనంత ఆస్తి ఉంది వాళ్ళకు. అయితే వాళ్ళు చాలా మంచి వాళ్ళు. ఎవరికి ఏ కష్టం వచ్చినా భరించలేరు. సంగతేంటో తెలుసుకొని వాళ్ళకు సహాయం చేసేవాళ్ళు.

అంత మంచి వాళ్లకు ఒకటే లోటు. పెళ్లై పది సంవత్సరాలు అయినా వాళ్లకు పిల్లలు పుట్టలేదు. పిల్లలకోసం వాళ్ళు తిరగని గుళ్ళు లేవు, చుట్టని గోపురాలు లేవు, వాడని మందులు లేవు, మ్రింగని మాత్రలు లేవు.

అట్లా తిరిగి తిరిగి వేసారాక, వాళ్ళు ఒకసారి తీరికగా ఆలోచించి, "పిల్లల కోసం మనం

ఇంత తపించవలసిన అవసరం లేదు. వేరే వాళ్ల పిల్లల్ని పెంచుకోవచ్చు, వాళ్ళని మన పిల్లల్లాగే బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దచ్చు కదా, దానిదేముంది?" అనుకున్నారు.



సరిగ్గా వాళ్ళు అట్లా అనుకునే సమయానికి, వాళ్ళు ప్రయాణిస్తున్న కారు కింద పడ్డాడు, ఒక పిల్లాడు. ఆ ప్రమాదంలో వాడికి బాగా దెబ్బలు తగిలాయి. సీత-రాముడు ఇద్దరూ వాడిని గబగబా ఆస్పత్రికి తీసుకెళ్ళారు. "గాయాలు చిన్నవే, ఏమీ పర్లేదు. ఒకటి రెండు రోజులు విశ్రాంతి తీసుకుంటే సరిపోతుంది" అన్నారు డాక్టరుగారు. దాంతో దంపతులు ఇద్దరూ వాడిని తమ ఇంటికి తీసుకెళ్ళారు.

కొంచెం తేరుకున్నాక, వాడి గురించి అడిగి తెలుసున్నారు- వాడికి ఎనిమిదేళ్ళు. పేరు రంగడు. వాడిది అక్కడికి దగ్గర్లోనే, అడవిలో ఉన్న ఊరు. వాడి అమ్మ నాన్నలు ఇద్దరూ అడవిలోనే ఉన్నారు. వాళ్ళిద్దరూ అడవిలోనే కూరగాయలు, పూలు పండించి, వాటిని దగ్గరి పల్లెల్లో తిరిగి అమ్ముతారు.

పది రోజుల క్రితం రంగడి తల్లి వాడిని మొక్కలకు నీళ్ళు పెట్టమన్నది. రంగడు. ఆ పని చెయ్యక, ఊరికే ఇంట్లోకి పరుగు పెట్టబోయాడు. అంతలోకే కాలు జారటం, వాడు కాస్తా పూల మొక్కల మీద పడి పోవటం, ఆ మొక్కలన్నీ విరిగి పోవటం- చక చలా జరిగిపోయాయి.

రంగడికి వాళ్ళ అమ్మ అంటే చాలా భయం. మొక్కలు విరగ్గొడితే వాళ్ళ అమ్మ ఊరుకోదు! అందుకని ఆమె

చూడకముందే విరిగిపోయిన ఆ మొక్కల్ని తీసి బయట పడేయాలని బయలు దేరాడు వాడు.



అయితే అమ్మ వాడి అల్లరి పనిని చూడనే చూసింది; కోపంతో నాలుగు దెబ్బలు కూడా వేసింది. దాంతో రంగడికి కోపం వచ్చింది; బాధ వేసింది. వెంటనే అలిగి, ఇల్లు విడిచిపెట్టేసి అడవిలోకి బయలు దేరాడు వాడు. అయితే వాడి దురదృష్టం కొద్దీ, అడవిలో కుక్క ఒకటి వాడి వెంట పడ్డది.

దాంతో వాడు తోచిన దిక్కుకల్లా పరుగు తీసి, చివరికి ఈ ఊరు చేరుకున్నాడు. వెనక్కి తిరిగి చూసుకుంటూ నడిచాడు; చివరికి వీళ్ళ కారు క్రింద పడ్డాడు'- అదీ సంగతి.


అయితే ఇప్పుడు వాడిని వాళ్ల ఇంటికి తీసుకెళ్ళి దిగబెట్టేందుకు సీత-రాములకు మనసు రాలేదు. "మనం ఎవరినైనా పెంచుకుందామనుకున్నాం కదా, అందుకని దేవుడు మనకోసమే వీడిని పంపిన-ట్లున్నాడు" అనుకున్నారు వాళ్ళు.

"నువ్వు మాతోటే ఉంటావా? నిన్ను బాగా చూసుకుంటాం" అని చెబితే, వాడు ఉంటానన్నాడు. దాంతో భార్యాభర్తలిద్దరూ సంతోషపడి, వాడు ఉండేందుకు వసతి గట్రా ఏర్పరచారు.

అట్లా ఒక రెండు రోజులు గడిచాయి. కానీ అంతలోనే రంగడు వాళ్ళ అమ్మ నాన్నల మీద బెంగ పెట్టుకున్నాడు. రోజూ రాత్రిపూట ఏడవటం మొదలు పెట్టాడు. చివరికి దంపతులు ఇద్దరూ బేజారైనారు. వాడిని తల్లి దండ్రులనుండి వేరుచేసి తమతోటే ఉంచుకోవాలనుకున్న ఆలోచన-లకు సిగ్గుపడ్డారు, వాడిని కారులో ఎక్కించుకొని, వాళ్ళ ఇంటికి చేర్చేందుకు బయలు దేరారు!

దారిలో రంగడికి చెప్పారు- "చూడు బాబూ! అమ్మా నాన్నలు మన మంచిని కోరి

రకరకాల సంగతులు చెబుతారు: ముద్దుగా చెబుతారు, కోపంగా చెబుతారు, తిడతారు, ఒక్కోసారి కొడతారు- అంత మాత్రానికే మనం అలిగి ఎక్కడికి పడితే అక్కడికి వెళ్ళకూడదు-



ప్రపంచం ఏమంత సరళంగా ఉండదు బాబూ! ఊరికే అలగటం, ఇల్లువిడిచి పారిపోవటం లాంటివి ప్రమాదం!" అని. రంగడు కూడా సిగ్గుపడ్డాడు. తెలివి తెచ్చుకున్నాడు. "ఇంకెప్పుడూ అట్లాంటి పొరపాటు చేయను" అని మాట ఇచ్చాడు.

పన్నెండు-పదమూడు రోజుల తర్వాత క్షేమంగా ఇల్లు చేరిన రంగడిని చూసి వాళ్ళ అమ్మానాన్నలు చాలా సంతోషపడ్డారు. సీత-రాములకు పదే పదే ధన్యవాదాలు చెప్పుకున్నారు. మేం వాడికోసం ఎంత వెతికామో! చూసి చూసి మా కళ్ళు కాయలు కాచాయి" అన్నారు. వాళ్ళ ప్రేమని చూసి సీతారాముల కళ్ళు చెమర్చాయి.

రంగడిని ఇంట్లో దింపి వచ్చాక దంపతులు ఇద్దరూ చిన్నబోయారు. దేవుడు తమకోసమే ఇచ్చాడనుకున్న పిల్లవాడాయె! వాడిని తిరిగి వాళ్ళింటికి పంపేసి "మంచి చేసామా, చెడు చేసామా?" అని ఒకటే ఆలోచించారు.

అయితే అంతలోకే వాళ్లకు శుభ శకునాలు కనిపించాయి. వాళ్ల ఎదురు చూపులు ఫలించాయి. సీతమ్మ గర్భం ధరించింది. కొన్ని నెలలకు చక్కని అమ్మాయి పుట్టింది వాళ్లకు!

బలమే జీవనం. బలహీనతే మరణం.



పరివర్తన

రచన-M.అనూష.ZPHS రాచర్ల బొప్పాపూర్, ఎల్లారెడ్డి పేట, రాజన్న సిరిసిల్లా జిల్లా, తెలంగాణ

రామయ్య ఎల్లమ్మ అనే దంపతులకు సంతానం లేదు. చాలా నోములు, వ్రతాలు చేశాక, డాక్టర్ల చుట్టూ తిరిగాక, చివరికి వాళ్ల కలలు ఫలించి కొడుకు పుట్టాడు. వాడికి 'రాజు' అని పేరుపెట్టారు. చాలా గారాబంగా పెంచారు.

రాజు పెద్దయ్యాక, వాడికి పెళ్ళి వయసు రాగానే, లలిత అనే ఓ చక్కని అమ్మాయిని ఇచ్చి పెళ్ళి చేసారు. కొడుకు-కోడలు సుఖంగా కాపురం చేస్తుంటే, తాము కాలు మీద కాలు వేసుకొని బ్రతకచ్చని ఆశ పడ్డారు రామయ్య-ఎల్లమ్మ.

అయితే 'ఏమీ లేని చోట సమస్యలు ఉంటాయి' అన్నట్లు, లలితకు ఎందుకనో అత్త మామలంటే సరిపోలేదు.




రాజు ఎప్పుడూ తల్లిదండ్రులమాటే పట్టించుకుంటాడని అలగటం మొదలు పెట్టింది. చివరికి రాజుని తన దిక్కుకు తిప్పుకున్నది. ఒకరోజున "ఈ ముసలి వాళ్ళు ఇక్కడ ఉంటే చాకిరీ చెయ్యటం కష్టం. ఇట్లాంటి వాళ్ల కోసమే 'వృద్ధాశ్రమం' అని అదేదో పెట్టారట. అందులో వేద్దాం" అన్నది. ఆ సరికి భార్యకు పూర్తిగా లోబడిన రాజు సరేనన్నాడు. తల్లిదండ్రులను తీసుకెళ్ళి వృద్ధాశ్రమంలో వదిలిపెట్టాడు.

.... కొన్ని రోజులకు రాజు-లలితలకి ఒక కొడుకు పుట్టాడు. వాడి పేరు రవి. రవికి లేని చెడు అలవాట్లు లేవు. పెద్దలంటే గౌరవం లేదు; ఇతరులు బాగు పడితే చూడలేక-పోయేవాడు; నోరు తెరిస్తే అబద్ధాలు చెప్పేవాడు. వాడిని పెంచి పెద్ద చేసేందుకు రాజు-లలిత చాలా కష్టపడాల్సి వచ్చింది. చివరికి ఎట్లాగో అట్లా తంటాలు పడి, 'రజిత' అనే చక్కని కోడల్ని చూసి, రవికి ఇచ్చి పెళ్ళి చేశారు.

రజిత చిన్న పిల్ల; చాలా కోప స్వభావి. "భర్త చెడు అలవాట్లకు కారణం వీళ్ళే" అని కూడా ఆమెకు అత్తమామలంటే విపరీతమైన ద్వేషం ఉండేది.

కొన్నాళ్ళు గడవగానే "ఈ ముసలివాళ్లను ఇద్దరినీ తీసుకెళ్ళి వృద్ధాశ్రమంలో వేసి రండి" అని రవితో పోరటం మొదలుపెట్టింది. "వీళ్ళంటే నాకేమీ ప్రేమ లేదు. ఉంటే ఏదో,

'నీకు సాయం చేస్తారు కదా' అనుకున్నాను. నువ్వు వద్దంటే ఇప్పుడే తీసుకెళ్ళి వృద్ధాశ్రమంలో వదిలేస్తాను!" అన్నాడు రవి.



వృద్ధాశ్రమానికి తీసుకెళ్ళేటప్పుడు రాజు-లలిత ఇద్దరూ రవిని చాలా బ్రతిమిలాడారు: "మేం ఊరికే ఇంట్లో పడి ఉంటాం, అస్సలు నోరు ఎత్తం, నిన్నుగానీ, రజితనుగానీ పల్లెత్తు మాట కూడా అనం. మమ్మల్ని మీతోనే ఉండనివ్వండి" అని ప్రాధేయపడ్డారు.

అయినా రవి వినలేదు. తల్లిదండ్రులను తీసుకెళ్ళి వృద్ధాశ్రమంలోనే వదిలాడు. రాజు-లలిత ఇద్దరూ అక్కడ లెక్కలేనన్ని ఇబ్బందులు పడ్డారు...

.... అంతలో రాజుకి మెలుకువ వచ్చింది. చూస్తే తను ఇంకా యువకుడే.. లలిత కూడా ఏమంత పెద్దకి కాలేదు. ఇద్దరికీ పిల్లలు పుట్టలేదు ఇంకా. ఇంకా రామయ్య-ఎల్లమ్మ బ్రతికే ఉన్నారు. నిన్ననే తను వాళ్లని తీసుకెళ్ళి వృద్ధాశ్రమంలో వేసాడు.. తనకు వచ్చిందంతా పెద్ద కల!

అతను వెంటనే లలితకు తన కల సంగతి చెప్పాడు. "అమ్మానాన్నల్ని వృద్ధాశ్రమంలో ఉంచద్దు. వెనక్కి తెచ్చి మనతోబాటే ఉంచుకుందాం. మన బాధ్యతని మనం మర్చిపోరాదు" అన్నాడు. ఆ సరికి తన తప్పు అర్థమైన లలితకూడా సరేనన్నది. రామయ్య ఎల్లమ్మ మళ్ళీ ఇల్లు చేరుకున్నారు!

బొమ్మకు కథ రాయండి

ఈ బొమ్మని చూశారా?! ఏమిటిది, ఇంత రాత్రి వేళ, ఈ అడవిలో?! నిధేనా, మరేదైనానా?! బలే ఉంది కదూ?! ఈ పాప ఎవరు, మరి? ఇక్కడికెందుకు వచ్చింది ? ఇదేదో ఈమెకు ఎలా దొరికింది ? మీకు తట్టిన ఆ కథనంతా చక్కగా రాసి పంపండి మరి ! బాగున్న కథల్ని కొత్తపల్లి-93 లో ప్రచురిస్తాం !





అర్థంలేని చదువు

మనకు ఏదైనా పదానికి అర్థం తెలియకపోతే టీచరును అడిగి తెలుసుకుంటాం కదా ? అదే, కాస్త పెద్దతరగతి పిల్లలైతే నిఘంటువు (డిక్షనరీ)లో వెతుకుతారు. నిఘంటువును సంస్కృతంలో 'కోశము' అని పిలిచేవాళ్ళు. ప్రాచీనకాలంలో మన దేశంలో చదువుకున్న వాళ్ళు అందరూ సంస్కృతం నేర్చేవాళ్ళు. అప్పట్లో "అమర కోశం" అనే సంస్కృత నిఘంటువుకు చాలా పేరు ఉండేది. చిన్న వయసు నుంచే అందరూ ఆ నిఘంటువును వల్లె వేసేవాళ్ళు. ఇప్పుడు మనం పిల్లలం అందరం లెక్కల్లో సూత్రాలు బట్టీ కొడతామే, అట్లా అనమాట. అయితే ఎప్పుడైనా ఇట్లా కంఠోపాఠం చేసేప్పుడు, ఆ అంశాల అర్థం కూడా తెలుసుకోవాలి- లేకపోతే ఊరికే నవ్వుల పాలవుతాం- ఇదిగో, ఈ కథలో లాగా.

సేకరణ, కథనం : శ్రీ ఇ.యన్.వి రవి, అనంతపురం.

అనగనగా ఒక పండితుడు ఉండేవాడు. అర్థం అదీ పట్టించుకోకుండా ఊరికే భట్టీ పట్టడమే అతని పని. అతను ఒకసారి అమరకోశంలోంచి ఒక శ్లోక పాదాన్ని భట్టీ పట్టాడు:

" వనప్రియః పరభృతః కోకిలః పిక ఇత్యపి " అని.

"వనప్రియ, పరభృతము, కోకిల, పికము- ఇవన్నీ కోకిలకు పర్యాయపదాలు" అని దీనికి అర్థం.

అయితే దీనికి చివరన 'ఇత్యపి' అని ఉన్నది చూసారా, 'ఇత్యపి' అంటే "ఇటువంటివి" అని అర్థం. కానీ ఆ పండితుడికి ఈ సంగతి తెలీదు. 'ఇత్యపి' అనేది కూడా కోకిలకు పర్యాయపదమే అనుకున్నాడు.

అట్లాగే మరో చోట, 'అప్యేకదంతః హేరంబః..' అని చదివాడతను-

"ఇంకా ఏకదంతుడూ, హేరంబుడూ.." అని దీని అర్థం. ఏకదంతుడూ, హేరంబుడూ,.. ఇవన్నీ వినాయకుడి పేర్లన్నమాట. కానీ అర్థం చేసుకోవటం రాని ఆ భట్టీ పండితుడు 'అప్యేకదంతుడు అనేదే వినాయకుడి పేరు' అనుకున్నాడు.

ఆ తర్వాత ఒకసారి ఆ పండితుడు తన భట్టీ పాండిత్యంతో రాజసభకు వెళ్ళాడు.

అక్కడ ఎవరో కవులు వసంత కాలాన్ని గురించి చెబుతున్నారు. మధ్యలో కల్పించుకుని మనవాడు ఇలా అన్నాడు: 'ఇత్యపులు గూయంగ

కోనంగుడేయంగ

అప్యేకదంతుడు

ఆడదొడగె' అని.

అది వినగానే అక్కడ చేరిన కవులందరూ నిశ్శబ్దం అయిపోయారు. పట్టు వస్త్రాలు అవీ ధరించి హుందాగా కనబడుతున్న పండితుడిని చూసి- "మీరెవరో మహా పండితుల్లా ఉన్నారు. కొంచెం

అర్థం వివరించండి" అన్నారు.



మనవాడు చెప్పాడు:

"ఇత్యపులు - అంటే కోకిలలు

కూయంగ - కూతలు పెట్టగా

కోనగుడు - మన్మథుడు

ఏయంగా - బాణాలు వేయగా

అప్యేకదంతుడు - వినాయకుడు

ఆడదొడగె - ఆడసాగినాడు" అని.

అంతలో పండితుల్లో ఒకడు అసలు రహస్యం కనుక్కొని బయటికి చెప్పేసాడు. అర్థమైన మిగతా వాళ్ళందరూ గొల్లున నవ్వారు.

రాజుగారు పండితుణ్ణి మందలించి ఇంటికి పంపేశారు. పాపం, తన పాండిత్యంతో ఏ ఉద్యోగమో, ఏ కొన్ని డబ్బులో వస్తాయనుకున్న పండితుడు తలవంచుకొని ఇంటిదారి పట్టాడు!

నిజమైన విద్య అంటే సమాచార సేకరణ కాదు. ప్రజ్ఞను పెంపొందించేదే విద్య. సంకల్ప శక్తిని సరైన రీతిలో, నైపుణ్యంగా ఉపయోగించేలా, వ్యక్తులకు ఇచ్చే శిక్షణే విద్య. సూక్తి!

దెబ్బకు దెబ్బ జోకు!

భిక్షగాడు: అమ్మా తల్లీ...ధర్మం చేయండమ్మా.... నేను మూగవాణ్ణి... కాస్త దయచూపండమ్మా..

గృహిణి: పక్క ఇంట్లో అడుక్కో బాబూ.. నాకు చెవుడు ... వినిపించదు..



చెట్లు - పిట్ట

ఒక్కోసారి మనకు మేలు చేసే వాళ్లనే తిడతామేం, మనం?! ఇదిగో, ఈ కథలో లాగా. అంతా పూర్తయ్యాక గానీ అసలు సంగతి అర్థం కాదు.


రచన: జి.వి.జి.కె.వేణు, బెంగులూరు.



నేనొక చిన్న పచ్చని చెట్టుని. మా ఊరి బళ్లో పిల్లలు పోయిన సంవత్సరం చెట్ల పండక్కి నన్ను, నాతో పాటు ఇంకో నాలుగు చెట్లనీ నాటారు. అప్పుడప్పుడు నీళ్లు పోస్తుంటారు.

పోయిన సోమవారం అనుకుంటాను,

నాకు రొమ్ములో కొంచెం కిత కిత మొదలైంది.



కొంచెం కొంచెం పెరిగి ఇవ్వాళ బాగా నొప్పి పుడుతుంది. ఏం చెయ్యాలో!

"ఏదో పిట్ట చప్పుడవుతోంది...అమ్మో! ఇది పొడిచే పిట్ట..! నా దగ్గరికి రాకపోతే బాగుండు!"

"అరే..నా మీదనే వాలింది. పొడుస్తుందేమో! ఏం పాడో...!అసలే నొప్పిగా ఉంది!"

"పాడు పిట్ట- పొడుస్తున్నది.. అబ్బా! అబ్బబ్బా...! సరిగ్గా నొప్పి పుడుతున్న చోటనే పొడుస్తున్నదే, ఇది?!"

"దీని సిగ తరగ...! పొడిచి చంపేస్తున్నది"



"అమ్మయ్య! ఇప్పటికైనా ఆపేసింది!-"

"అయ్యో! వామ్మో! బాబోయ్! కాపాడండి! ఈ పిట్ట ఇప్పుడు ఏం చేస్తున్నదో చూడండి! నా లోపలికి ముక్కు పెట్టి తిప్పుతున్నది!"

"అబ్బా..నొప్పి..!"

"నా కొమ్మలే చేతులైతేనా.., దీన్ని నలిపేద్దును! ఒట్టి పనికి మాలిన పిట్ట. నా మీదే

ఎందుకు వాలాలి?"

"అయ్యో! ఈ పిట్ట ఏదో లాగుతున్నది..వామ్మో!..ఎంత పెద్ద పురుగో!..నా రొమ్ము లోనించే లాగింది?!...పురుగుని ఎట్లా తినేసిందో చూడు!



"ఉం... బాగుంది! ఇప్పుడు నా నొప్పి కూడా తగ్గుతున్నట్లుంది... చాలా హాయిగా ఉంది ఇప్పుడు"

"ఇంతకీ నాకు ఆ పురుగు వల్లనే అనమాట, నొప్పి పుట్టింది! దాన్ని బయటికి తీసేసి ఈ పిట్ట నాకు చాలా సాయం చేసింది! నిజంగా ఇది ఎంత మంచిదో కదా..! అనవసరంగా తిట్టినట్లున్నాను, దాన్ని?!"

కవితలు

కులం మతం అని తేడాలు వద్దురా
అందరూ మనుషులే అని తెలుసుకోరా
అప్పుడే జీవితంలో ఎదుగుతావురా

చెట్లను నరకడం మానుకో
అవి చేసే మేలును తెలుసుకో
జంతువులను హింసించటం మానుకో
అవి కూడా మనలాంటి జీవులని తెలుసుకో

వి.ఆర్. కృతి, వికాస విద్యావనం విజయవాడ.



గురువుగారి అలవాటు

రచన:డా.సిరి, మిర్యాల గూడ, నల్గొండ జిల్లా.

కుంతల రాజ్య సరిహద్దుల్లో ఒక గురుకులం ఉండేది. చాలామంది రాజకుమారులు, సామాన్యులు కూడా అక్కడ చదువుకునేందుకు పోటీ పడేవాళ్ళు. దాన్ని నడిపే ధర్మేంద్రుడు మంచివాడు, ఆప్యాయత గల వాడున్నూ. శిష్యులందరికీ శాస్త్ర విద్యలు నేర్పటంతో పాటు, వాళ్ళు ఎలా నడుచుకోవాలో, ఎవరితో ఎలా మెలగాలో కూడా సందర్భోచితంగా చెబుతుండేవాడు.

శిష్యులందరూ కూడా ఆయన బాటలో నడిచేవాళ్ళు: గురువుగారిని బాగా గమనించేవాళ్ళు. ఆయన ఏ పనిని ఎలా చేస్తాడో చూసి, తాము కూడా అన్నింటా అదే విధంగా ఉండేందుకు ప్రయత్నించేవాళ్ళు.

శిష్యులకు తన పట్ల ఉన్న గౌరవాన్ని, ప్రేమను చూసి ధర్మేంద్రుడు చాలా సంతోషపడేవాడు. తనే ఆదర్శంగా తమ ప్రవర్తనను మలచుకుంటున్న శిష్యుల పట్ల ఆయన చాలా బాధ్యతగా ఉండేవాడు. ఎప్పటికప్పుడు తనను తాను మెరుగు పరుచుకుంటూ, నిజాయితీగా ఉండేందుకు ప్రయత్నించేవాడు.

అయితే ఎంత ప్రయత్నించినా, ఒక్క పచ్చడి అలవాటుని మాత్రం ఆయన మార్చుకోలేకపోయాడు: సంగతి ఏంటంటే, పిల్లవాడిగా ఉన్నప్పుడు ధర్మేంద్రుడు ఏనాడూ కడుపునిండా భోజనం చేసింది లేదు. చాలా సార్లు భోజనం లేక, పస్తులు ఉండాల్సి వచ్చేది. ఆ రోజుల్లో వాళ్లది అంత పేద కుటుంబం. అట్లాంటి పరిస్థితిలో ఆకలిని ఎదుర్కునేందుకు, వాళ్ళ అమ్మ ఒక ఉపాయం కనిపెట్టింది. తనకు దొరికిన కూరగాయ ముక్కల్నల్లా ఎప్పటికప్పుడు ఉప్పు, కారాలతో కలిపి, ఒక మట్టిపాత్రలో ఊరబెట్టేది. ఆకలైనప్పుడల్లా ఆ ఊరగాయని కొంచెం నోట్లో వేసుకొమ్మనేది ధర్మేంద్రుడిని.

ఆవిడ ప్రేమ కలవటం వల్లనో, ఏమో, మరి ఊరగాయ మటుకు చాలా కమ్మగా ఉండేది. అట్లా మొదలైన ఊరగాయ నాక్కునే అలవాటు, ఇన్నేళ్ళ తర్వాత కూడా ధర్మేంద్రుడిని వీడి పోలేదు. ఆ పచ్చడే లేకపోతే, ఆయనకి ప్రశాంతత ఉండేది కాదు.

అందుచేత, ఆయన ఊరగాయ జాడీని ఎప్పుడూ తనకు వీలైనంత దగ్గర్లో ఉంచుకునేవాడు. ధర్మేంద్రుడు ఎక్కడికి వెళ్ళినా, జాడీ కూడా ఆయనతోబాటు వెళ్ళేది. ఒక వైపున ఆయన పిల్లలకు పాఠాలు చెబుతుంటే కూడా, జాడీ ప్రక్క గదిలోనే ఉండేది. శిష్యులకు పాఠం చెప్పి, వాళ్ళు

దాన్ని వల్లె వేస్తున్న సమయంలో చటుక్కున పోయి, కొంచెం ఊరగాయ నోట్లో వేసుకునేవాడు ధర్మేంద్రుడు. పిల్లలంతా సాధన చేస్తున్నప్పుడు, తాను ఏదో ఒక వంక పెట్టుకుని ఇంట్లోకి వెళ్ళి, జాడీని తీసుకుని, కావలసినంత తిని, ఏమీ ఎరుగనట్టు తిరిగి వచ్చేసేవాడు.

అయితే అనుక్షణం గమనిస్తూ, ఆయన చేసే ప్రతి పనినీ పాఠంగా భావించే శిష్యులు కొందరు, ఆయన చేసే ఈ గొప్ప పనిని చూడనే చూసారు: 'గురువుగారి ఆ రహస్య జాడీ ఏంటి? అందులో ఉన్నది ఏంటి? అది ఎట్లా ఉంటుంది? దాన్ని రహస్యంగానే ఎందుకు తినాలి?'లాంటి ప్రశ్నలు అనేకం కలిగి, ఊపిరాడలేదు వాళ్ళకు.

'మీరు వల్లె వేస్తూండండి- నేను ఇప్పుడే ఓ ముఖ్యమైన పని ముగించుకొని వస్తాను" అని వెళ్ళిన గురువుగారు, జాడీలోంచి దేన్నో తీసి నోట్లో వేసుకుంటున్నారు.. అదే ముఖ్యమైన పని అన్నట్లు! ఎందుకు ఇలా?!' అని వాళ్ళకు ఒకటే ఆరాటం వేసింది.

సరిగ్గా అదే సమయంలో ధర్మేంద్రుడికి భార్యా సమేతంగా పొరుగూరికి వెళ్ళాల్సిన పని పడింది. ఆయన తన ఊరగాయ జాడీని కూడా భద్రంగా మూటగట్టుకొని, పోతూ పోతూ గురుకులాన్ని, ఇంటిని శిష్యులకు అప్పగించి వెళ్ళారు.



"ఇదే కదా, తగిన సమయం!" అనుకున్న శిష్యులు, వాళ్ళు అటు వెళ్ళగానే ఇటు వంటగదిలోకి దూరారు. వెతకగా వెతకగా వాళ్ళకు అక్కడో మూల మూటగట్టి ఉన్న

జాడీ ఒకటి కనిపించింది.

వాళ్లంతా దాని చుట్టూ మూగారు. ఎవరికి వాళ్ళు ఆత్రంగా ఆ జాడీలో చెయ్యిపెట్టారు; అందులో ఉన్నదాన్ని తలా ఒక గుప్పెడూ తీసుకున్నారు; అటుపైన వేరే వాళ్లకు కనిపించకుండా దూరంగా పోయారు. ఎవరికి వాళ్ళు తమ గుప్పెళ్ళలో ఉన్నదాన్ని నోట్లో పోసుకున్నారు! అంతే- త్వరలోనే గురుకులమంతటా హాహా కారాలు మొదలయ్యాయి. అందరికీ కళ్ళు మంటలు, ముఖం మంట, తుమ్ములు, ముక్కు కారటం, దగ్గు, పడిశం!! ఎందుకంటే వాళ్లు తిన్నది ఊరగాయ కాదు- కొరివి కారం!!

ఎప్పుడూ పంచభక్ష్య పరమాన్నాలే తింటూ, 'కారం' అనేది ఒకటి ఉంటుందని కూడా తెలియకుండా పెరిగిన రాకుమారులందరూ, తాము బుక్కిన ఆ కారం ధాటికి తట్టుకోలేక పోయారు. నోరు, కళ్ళూ మండడమే కాదు- అందరికీ కడుపులో విపరీతమైన మంట పుట్టింది!

పని నెరవేర్చుకొని మధ్యాహ్నం కల్లా తిరిగి వచ్చిన ధర్మేంద్రుడు, అతని భార్య బాధతో మెలికలు తిరిగిపోతున్న తన శిష్యుల్ని చూసి కంగారు పడిపోయారు. "నాయనా ఏమయింది? ఎందుకిట్లా అయినారు అందరూ?" అని అడిగితే అందరూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటారు; ఎవ్వరూ ఏమీ చెప్పరు!.

చివరికి వాళ్ల చేతికి అంటి ఉన్న కారాన్ని, మూత తెరిచి వున్న కారం జాడీనీ చూసి సంగతి కనుక్కున్నారు వాళ్ళు. సమయస్ఫూర్తి గల గురుపత్ని వెంటనే అందరిచేతా చన్నీళ్ళతో స్నానం చేయించింది; కడివెడు మజ్జిగ తెచ్చి పిల్లలందరి తోటీ త్రాగించింది. దాంతో మెల్లగా వాళ్ళ ప్రాణం కుదుట పడింది.

ఆ రోజు సాయంత్రం పిల్లలందర్నీ కూర్చోబెట్టి "నాయనలారా! అసలు ఏం జరిగింది? అసలు ఆ కారం జాడీని మీరెందుకు తీశారు? మీ అందరి చేతులకూ అట్లా కారం ఎందుకంటింది? అందరికీ ఒకేసారి కారం

తినాలని ఎందుకనిపించింది? అసలు మీకేమైనా కావాలంటే నన్ను అడగవచ్చు కదా?!" అన్న గురువుగారితో పిల్లవాడొకడు ధైర్యం చేసి చెప్పేసాడు: "గురువుగారూ! క్షమించండి. చాలాసార్లు మీరు ఏదో దాచుకుని చాటుగా తినడం చూశాం మేమందరం. అది ఏంటో తెలుసుకోవాలని, కొంచెంగానన్నా రుచి చూడాలనీ ఎక్కడా లేని ఆశ పుట్టింది మాకు. అందుకే అందరం కలిసి వెళ్ళి ఆ జడీ మూత తీశాం. ఇంకెప్పుడూ మీ అనుమతి లేకుండా ఏదీ చేయ్యం. ఈసారికి మమ్మల్ని క్షమించండి!" అని.

తప్పు తనలోనే ఉన్నదని అర్థమైంది ధర్మేంద్రుడికి: "తల్లిదండ్రుల్ని, గురువుల్నీ చూసి నేర్చుకుంటారు పిల్లలు. వాళ్లని మంచి దారిలో నడిపించాలంటే ముందుగా పెద్దలు మంచి దారిలో నడవాలి. ఎవరు ఎంత ప్రయత్నించినా, చెడు మాత్రం దాగదు!"

ఇక ఆ నాటి నుండి ఆయన మరెప్పుడూ దొంగ చాటుగా ఏమీ తినలేదు. తనలోని చెడును సంపూర్ణంగా జయించాడు.

వంశ పారంపర్యం

డాక్టర్: రామప్ప గారూ ఈ జబ్బు మీతో రాలేదు. వంశపారంపర్యంగా వచ్చింది. ఆపరేషన్ చేస్తే పోతుంది.

రామప్ప: హమ్మయ్య బతికించారు. అయితే ఆ ఆపరేషనేదో మా తాతయ్యకు చెయ్యండి.

జోకు!

డాక్టర్: రావయ్యా సోము! ఇప్పుడే నీ గురించి చెప్పారు మావాళ్లు!

రాజు: ఎందుకండీ, ఏమని చెప్పారు?!

డాక్టర్: ఫీజు కింద నువ్వు ఇచ్చిన చెక్కు బౌన్స్ అయిందటయ్యా.

రాజు: మీరు నయం చేసిన జబ్బు కూడా అట్లాగే బౌన్సయి తిరిగి వచ్చింది సార్!



మంచి కాకి కథ

రచన: శ్రీ మద్దిరాల శ్రీనివాసులు గారు, ఉపాధ్యాయులు, ప్రాథమికోన్నత పాఠశాల , కంకణాలపల్లి, త్రిపురాంతకం మండలం, ప్రకాశం జిల్లా.



కటారుపల్లె శివార్లలో వేపచెట్టు ఒకటి ఉండేది. అందులో గూడు కట్టుకుని నివసించేవి, ఒక తల్లికాకి, దాని నాలుగు చిట్టి చిట్టి పిల్లలు!

అదే చెట్టు క్రింద, తొర్రలో ఉడత ఒకటి ఉండేది.

కాకీ, ఉడతా రెండూ "వదినా-వదినా" అనుకుంటూ చాలా సన్నిహితంగా ఉండేవి.

తల్లి కాకి రోజూ ఊళ్ళోకి వెళ్ళి ఆహారం కోసం వెతికేది. దొరికిన ఆహారాన్ని ముందుగా పిల్లలకు తెచ్చి పెట్టేది. అంతా అయినాక మళ్ళీ వెళ్ళి, తను కడుపు నింపుకొని వచ్చేది.



ఉడత మటుకు అక్కడికి దగ్గర్లోనే తిరుగుతూ ఉండేది రోజంతా. సాయంత్రం కాగానే ఓమాటు కాకినీ, పిల్లల్నీ పలకరించి, తన తొర్రలో దూరేది.

అయితే ఒకసారి చీకటి పడుతున్నది, అయినా తల్లికాకి ఇల్లు చేరలేదు. అమ్మ రాలేదని పిల్లలు కంగారు పడసాగాయి. ఉడత కొంచెం సేపు ఉండి వాటిని ఊరడించింది. "వచ్చేస్తుందిలే, ఏమీ పర్లేదు" అని చెప్పింది. పిల్లలు కొంచెం సర్దుకోగానే "నేను మళ్ళీ వస్తాను" అని ఇంటికి పోయింది. అయితే, రోజంతా తిరిగి తిరిగి అలసిపోయిందేమో, తొర్రలోకి దూరగానే దానికి విపరీతమైన తూగు వచ్చింది. "కొంచెం అటో ఇటో- వదిన రాక ఎక్కడికి పోతుందిలే!" అని తను నడుం వాల్చింది.



అంతలో బాగా చీకటి పడింది. అయినా కాకి ఇంకా ఇల్లు చేరలేదు. పిల్లలు తల్లికోసం ఎదురు చూస్తూనే ఆడుకుంటున్నాయి. అయితే అంతలోనే అకస్మాత్తుగా ఎక్కడినుంచో పెద్ద కాకి ఒకటి ఎగిరి వచ్చింది. పిల్లల దగ్గర ఉన్న తిండి అంతా లాక్కొని తినేసింది. పిల్లలు భయంతో "కుయ్యో!మొర్రో!" అని కేకలు పెట్టాయి. ఉన్న అన్నం అంతా తినేసాక, పిల్లల్ని గూట్లోంచి

కిందకు తోసేసింది పెద్ద కాకి. పిల్లలు చాలా సేపు "అమ్మా! అమ్మా!" అని ఏడ్చి, అక్కడే సొమ్మసిల్లి పడిపోయాయి.

గాఢ నిద్రలో ఉన్న ఉడతకు ఇదంతా తెలియదు.

ఆరోజు రాత్రి చీకటి పడ్డాక వచ్చింది తల్లి కాకి. 'చూస్తే పిల్లల జాడ లేదు! వేరే ఏదో పెద్ద కాకి తన గూట్లో పడుకొని ఉన్నది!'

అది కంగారుగా దాన్ని నిద్రలేపింది. ప్రశ్నల మీద ప్రశ్నలు వేయసాగింది.



"ఏయ్! ఎవ్వతెవే నువ్వు?! ఆపు, నీ గోల! ఇంత రాత్రి వచ్చి నా నిద్ర చెడగొట్టింది చాలక, పిచ్చి పిచ్చి ప్రశ్నలు వేసి విసిగిస్తావా? ఇది నా గూడు! నువ్వు ఎటుపోతావో పో! నీ పిల్లల సంగతి నన్ను అడక్కు!" అని అరిచి, దాన్ని ఒక్క తోపు తోసింది పెద్ద కాకి.

దెబ్బకు కింద పడింది కాకి. చూస్తే తన పిల్లలు కూడా అక్కడే చెట్టు మొదట్లో దిక్కులేకుండా పడి ఉన్నాయి. దాని గుండె తరుక్కుపోయింది. అంతలో పిల్లలు లేచి "అమ్మా!అమ్మా!"అంటూ ఏడవసాగాయి. తల్లికాకి వాటిని సముదాయించసాగింది.

ఆ గందరగోళానికి మెలకువ వచ్చింది ఉడతకు. జరిగిన విషయం తెలుసుకొని అది "అయ్యో! ఎంత పని జరిగింది! ఇప్పుడు ఎలాగ? ఇద్దరం వెళ్ళి దాని అంతు చూద్దామా?" అన్నది.

"వద్దులే వదినా! ఎవరి పాపాన వాళ్లే పోతారు!" అంది తల్లికాకి.

"రేపు ఉదయాన్నే ఏదో ఒకటి చేద్దాం. ఈ రోజుకు ఇక్కడే పడుకోండి వదినా!" అని అవి

పడుకునేందుకు ఏర్పాట్లు చేసింది ఉడత.

సరేనని అన్నీ అక్కడే పడుకొని నిద్రపోయాయి.

వేపచెట్టుకు ఎదురుగా ఓ చింత చెట్టు ఉంది. ఆ చెట్టు మీద పాత గూడు ఒకటి, ఖాళీగానే ఉన్నది. తెల్లవారగానే ఆ గూటిలోకి చేరినై, కాకి, పిల్లలు. కాకి ఆహారం కోసం ఊళ్ళోకి వెళ్దామనుకున్నది. 'అవతలి చెట్టుపైన తుంటరి కాకి ఏం చేస్తున్నదా' అని చూసింది. అది ఇంకా పడుకునే ఉంది. "అది లేచి, ఆహారం కోసం బయటికి వెళ్ళాక, అప్పుడు వెళ్తా, నేను!" అనుకొని ఇంకా కాసేపు చూసింది తల్లి కాకి. అయితే పెద్ద కాకి ఎంతకీ లేవలేదు.

ఇంతలో తల్లికాకికి ఒక ఆలోచన వచ్చింది. ఆ రోజు నుండి తను ఇంకా కష్టపడటం మొదలు పెట్టింది. తెచ్చిన ఆహారాన్ని పిల్లలకు సరిపడా పెట్టి, ఆపైన మిగిలిన దాన్ని తీసుకెళ్ళి పెద్దకాకికి వేయడం ప్రారంభించింది.

"ఇదేదో బాగానే ఉందే!" అనుకున్న బద్ధకపు కాకి అసలు ఇంట్లోంచి కాలు బయటికి పెట్టటమే మానేసింది: పిల్లల జోలి వదిలేసింది. ఏమంటే తల్లి కాకికి శ్రమ ఎక్కువైంది.



ఒకరోజు సాయంత్రం ఉడత కాకితో 'ఏంటి వదినా, నీవు చేసే పని?! దానికి కూడా నువ్వు ఆహారం తెచ్చి పెట్టడం ఏంటి?!' అన్నది.

'ఏం చేస్తాం వదినా, తప్పదు! పిల్లలు పెద్ద అయ్యేంతవరకూ దుష్టుల్ని దూరంగా ఉంచాలంటే ఇది తప్ప వేరే మార్గం లేదు! అయినా ఏం పోయిందిలే, నాకు ఇంకో పిల్ల అనుకుంటా' అన్నది తల్లి కాకి.

అయితే ఇట్లా వారం రోజులు గడిచాయో లేదో- పెద్ద గాలివాన వచ్చింది. వేపచెట్టు క్రిందినుండి దభీల్మని శబ్దం వచ్చింది. "ఏమిటా?!" అని బయటికి తొంగి చూసింది ఉడత. కొత్త కాకి! గూటితో సహా క్రింద పడి ఉన్నది! మూలుగుతూ ఉంది! దెబ్బలు తగిలి రక్తం కారుతున్నది. ప్రాణాపాయ స్థితిలో ఉంది!



ఉడత పోయి, ఎదురుగుండా చింత చెట్టు మీద ఉన్న తల్లి కాకిని పిలిచింది. రెండూ కలిసి దానికి కట్లు కట్టి, సపర్యలు చేసాయి. తల్లి కాకి దానికి ఆహారం తెచ్చి పెట్టింది. రెండు రోజులకు మరి కొంత కోలుకుంది పెద్ద కాకి. అటుపైన మరో రెండు రోజులు కష్టపడి దానికి ఒక మాదిరి గూడు కూడా ఏర్పాటు చేసింది తల్లికాకి.

అదంతా చూసిన పెద్ద కాకి మనసు కరిగింది. కళ్ళనీళ్లు తిరిగాయి. 'ఛీ! అసలు నాకు బుద్ధి లేదు. ఇంత మంచి కాకికి నేను ఎంత ద్రోహం చేశాను! బ్రతికుండగా ఇంక ఎప్పుడూ ఎవరికీ హాని చేయకూడదు. చేతనైతే వాళ్లలానే ఇతరులకు సహాయం చేయాలి' అనుకుంది మనసులో.

తర్వాతి రోజున తను కూడా త్వరగా లేచి, ఆహారం కోసం వెళ్లింది. కొంత ఆహారాన్ని తెచ్చి కాకి పిల్లలకు పెట్టింది: "భయపడకండి, నేను మిమ్మల్ని ఏమీ చేయను. నేను మీ పెద్దన్ననే అనుకోండి!" అన్నది. పిల్లలు, తల్లికాకి అన్నీ చాలా సంతోషపడినాయి. సంగతి తెల్సిన ఉడత "నీ మంచితనం ఊరికే పోలేదులే వదినా! దానివల్ల మనకు మరో మిత్రుడు దొరికాడు!" అంటూ ఆనందపడింది.



నిజమైన స్నేహితుడు

"స్నేహం అంటే ఊరికే కలిసి తిరగడం కాదు; ఊరికే కలిసి ఉండటం కాదు. కష్టాలలో ఉన్న మిత్రుడిని ఆదుకున్నవాళ్ళే నిజమైన స్నేహితులు. ఎవరైనా ఎట్లాంటి స్నేహితులో మనకు వాళ్ల ప్రవర్తన వల్లనే తెలుస్తుంది" అని రాస్తున్నది ప్రియాంక..

రచన: జి. ప్రియాంక, ఎనిమిదవ తరగతి, యుపి స్కూల్, కంకణాల పల్లి, ప్రకాశం జిల్లా.

కంకణాల పల్లిలో నివసించే చెన్నకేశవులు, వెంకట్రావు ఇద్దరూ మంచి స్నేహితులు. ఏ పనినైనా ఇద్దరూ కలిసి చేసేవాళ్ళు. ఏ విషయం అయినా కూడా వాళ్లిద్దరికీ తెలియాల్సిందే. ఆ విధంగానే వాళ్ళిద్దరూ పదో తరగతి కలసి పూర్తి చేశారు.

సరిగ్గా ఆ సమయానికే వెంకట్రావు వాళ్ళ నాన్న బాగా తాగి తాగి చనిపోయాడు.

ఇంటి పరిస్థితి అయోమయంగా ఉండటంతో కొన్ని రోజుల పాటు వెంకట్రావు కాలేజీలో

చేరలేదు. అయితే వాడు పై చదువులు చదవాలనీ, గొప్పవాడు కావాలనీ వాళ్ళ అమ్మ పట్టుదల.



అందుకని ఆమె తను కూడ బెట్టుకున్న కొద్ది పాటి డబ్బుతోటే వెంకట్రావుని చదివించాలని పూనుకున్నది.

కొద్ది కొద్దిగా డబ్బులు కడతానని కాలేజీ వారిని ఒప్పించి, చివరికి ఎలాగో ఒకలా వెంకట్రావుని కాలేజీలో చేర్పించింది.

వెంకట్రావు కూడా తల్లి ఆశయానికి అనుగుణంగా శ్రద్ధగా చదువుతున్నాడు- సమయాన్ని అస్సలు వృధా చేసుకోవట్లేదు.

అయితే కొద్ది రోజులు గడిచేసరికి, కాలేజీ వారు తమకు రావలసిన ఫీజు కట్టమన్నారు. వెంకట్రావు వాళ్ల అమ్మ 'రెండు మూడు వారాలలో కడతా' నని చెప్పింది గానీ, ఎంతకీ ఫీజు కట్టలేకపోయింది.

చివరికి కాలేజీ వాళ్ళు వెంకట్రావుని ఇంటికి వెళ్ళమన్నారు. "సాయంత్రంలోగా ఫీజు కడితే కట్టు- లేకపోతే ఇక కాలేజీకి రానవసరంలేదు" అనేసారు.

వాడి ఆ కష్టాన్ని గమనించాడు చెన్నకేశవులు. అప్పటికి తాను పొదుపు చేసుకున్న డబ్బుల్ని తీసుకొచ్చి, స్నేహితులనుండి మరి కొంత డబ్బును పోగు చేసి, తన తండ్రికి కూడా తెలియకుండా కాలేజీ యాజమాన్యానికి చెల్లించాడు. దాంతో వెంకట్రావుమీద ఒత్తిడి తగ్గింది.

కాలేజీ వారు వాడిని ప్రశాంతంగా వదిలారు.

ఆ వారం చివర్లో వెంకట్రావు వాళ్ళ అమ్మ డబ్బులు తీసుకువచ్చింది.

కాలేజీ వాళ్ళకు ఎంత కట్టాలో అంత కట్టింది. మిగిలిన డబ్బుల్ని చెన్నకేశవులుకు జమ చేసింది.



అట్లా వెంకట్రావు, చెన్నకేశవులు కలిసి చదివారు. బాగా కష్టపడ్డారు. మంచి మార్కులు తెచ్చుకున్నారు. చదువులు పూర్తి చేసుకొని తల్లి దండ్రుల కోర్కెలను తీర్చారు. తాము కోరుకున్న ఉద్యోగాలు సంపాదించుకోగలిగారు. మంచి స్నేహితులు అనిపించుకున్నారు.

అభి: నాన్నా స్కూల్లో ఒక చిన్న గెట్ టు గెదర్ ఉంది వస్తావా?

తండ్రి: చిన్న గెట్ టు గెదరా? అంటే పార్టీ! ఎవరెవరు వస్తున్నారురా?

అభి: ఊరికే- కేవలం నువ్వూ, నేను ఇంకా మా హెడ్ మాస్టరూ, ముగ్గురమే.

నవ్వు!

భార్య: ఏమండీ..! నేను పాడతాను; మీరు తాళం వేస్తారా, ప్లీజ్?!

"ఓ అలాగే!" అని ఆవిడ పాట అందుకోగానే లేచి. గది బయట తాళం వేసి వెళ్లిపోయాడు భర్త!

రత్నం: మీ అబ్బాయి ఏమి చేస్తూ ఉంటాడు?

కనకం: ఎక్స్‌పోర్ట్ అండ్ ఇంపోర్ట్

రత్నం: అవునా! పెద్దపనే! ఏమి బిజినెస్?!

కనకం: వాట్స్ ఆప్‌లో వచ్చినవి ఫేస్‌బుక్‌లో, ఫేస్‌బుక్‌లో వచ్చినవి వాట్స్ ఆప్‌లో పెడుతూ ఉంటాడు.



సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కథ

'నేనే అందరికన్నా తెలివైన వాడిని' అని భావించద్దండి. ప్రతి వ్యక్తిలోనూ వాళ్లవాళ్ల రంగానికి సంబంధించిన తెలివి తేటలు ఉంటాయి" అని చెబుతూ ఈ కథని రాసి పంపారు ప్రసాద్ గారు. చదివి నవ్వుకోండి మరి !

మూలం: 27.3.2012 న "ది హిందూ" దినపత్రికలో ప్రచురితమైన 'రాంగ్ ఛాయిస్ ' అనే హాస్యకథ.

అనుసరణ : శ్రీ పి.వి.ప్రసాద్ గారు, విజయవాడ.

ఒకసారి ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీరు సెలవల్లో దేశాటనకు వెళ్ళాడు. అట్లా అతను ఒక పర్వత ప్రాంతంలో పోతుండగా, గొర్రెల కాపరి ఒకడు ఎదురయ్యాడు. అతని వెంట ఒక పెద్ద గొర్రెల మంద ఉన్నది. ఆ మందలో చిన్న చిన్న, బొచ్చు బొచ్చు గొర్రె పిల్లలు- చాలా ముచ్చటగా వున్నాయి.

కంప్యూటరు బొమ్మల్లో తప్ప, నిజ జీవితంలో ఏనాడూ వాటిని చూసి ఉండని ఇంజనీరు ఆ దృశ్యానికి పరవశించి పోయాడు. "ఎలాగైనా ఒక గొర్రె పిల్లను సంపాదించాలి" అనే కోరిక ఒకటి అతని మనసులో

మొలకెత్తి, కొమ్మలు రెమ్మలు వేసేసింది.

దాంతో అతను ఆ గొర్రెల కాపరి దగ్గరికి వెళ్ళి "చూడు గోపన్నా, నేను నీ గొర్రెను ఒక దాన్ని కొనాలనుకుంటున్నాను. ఖరీదెంతో చెప్పు!" అన్నాడు.

దానికి ఆ గొర్రెల కాపరి "ఈ గొర్రెలు అమ్మేవి కావు!" అని ముక్తసరిగా జవాబిచ్చాడు.

ఇంజనీరు గొర్రెలతనిని ఎంతగానో బ్రతిమిలాడాడు. అయినా ఫలితం లేదు. గొర్రెను అమ్మేందుకు కాపరి ఏ మాత్రం ఇష్టపడలేదు.

"ఎంత ఖర్చయినా పర్లేదు- మిగతా ప్రపంచానికి ఏమి జరిగినా పర్లేదు- అనుకున్నదాన్ని సాధించాల్సిందే" అనుకునే ఇంజనీరుగారికి ఇది అస్సలు ఏమాత్రం మింగుడు పడలేదు.

చివరికి అతనికో ఆలోచన తట్టింది. గొర్రెల కాపరిని ఉద్దేశించి "చూడు గోపన్నా! నువ్వెంత చెప్పినా నిన్ను, నీ గొర్రెల్ని వదిలి పోబుద్ధి కావట్లేదు. అందుకని నేను ఒక పని చేస్తాను. ఎంత శ్రమ అయినా పర్లేదు; నీ మందలో ఉన్న గొర్రెలను ఒక్కొక్కదానినీ లెక్క పెట్టకుండానే, అవి మొత్తం ఎన్ని గొర్రెలో చెబుతాను నేను. నేను చెప్పే ఆ సంఖ్య గనుక సరిపోతే, నా తెలివి తేటలకు బహుమానంగా నువ్వు ఒక గొర్రెను ఇద్దువు. సరేనా?" అన్నాడు.

గొర్రెల కాపరికి అది ఇష్టం కాలేదు. "నా గొర్రెలు ఎన్ని ఉన్నాయో నాకు తెలుసు కదా, అది చెప్పేకి ఈయనెందుకు?" అనుకున్నాడు. "అయినా ఒక్క అంకె చెబితే గొర్రెనెందుకు ఇవ్వాలి, అనవసరంగా?" అని కూడా అనుకున్నాడు. అయినా అతను అడిగిన తీరు నచ్చి, ఓమాటు నవ్వి "సరే" అన్నాడు.

వెంటనే ఇంజనీరు మందలోని గొర్రెల్ని అన్నిటినీ ఒకసారి తన మొబైల్ ఫోనుకు చూపించాడు. గూగుల్ మ్యాప్స్ నొక్కాడు. తనున్న ప్రాంతాన్ని జూం చేసాడు. అందులో కనబడ్డ గొర్రెల్ని లెక్క పెట్టేందుకు అర్జంటుగా ఒక యాప్ తయారు చేసాడు. చివరికి

చెప్పాడు "ఇవి డెబ్భై రెండు " అని.



"మీరు చెప్పింది నిజమే ! ఇవి డెబ్భై రెండు" ఒప్పుకున్నాడు గొర్రెల కాపరి. "సరే ... మీరు పందెంలో నెగ్గారు గనుక ఈ మందలోంచి ఒక గొర్రెను తీసుకెళ్ళండి" అన్నాడు.

సంతోషంతో ఉబ్బిపోయాడు ఇంజనీరు. వెంటనే మందలోకి వెళ్ళాడు. ఓ జీవాన్ని ఎంచుకున్నాడు. దానిని తన భుజాల పైకి ఎత్తుకున్నాడు. ఆ విధంగా తను కోరిన దాన్ని చేజిక్కించుకొని తిరిగి వెళ్ళేందుకు ఉద్యుక్తుడవుతుండగా గొర్రెల కాపరి ఆయనకు అడ్డు వచ్చాడు- "ఒక్క నిమిషం ఆగండి! నేను కూడా ఒక పందెం కాయాలనుకుంటున్నాను మీతో" అన్నాడు.

"అవునా?! ఏమిటా పందెం?!" అడిగాడు ఇంజనీరు.

"తమరి వృత్తి ఏంటో చెప్పేస్తాను నేను. నేను చెప్పింది గనుక నిజమైతే, మీరు గెల్చుకున్న ఆ జీవాన్ని నాకు తిరిగి అప్పగించాల్సి ఉంటుంది" అన్నాడు గొర్రెలకాపరి, సీరియస్‌గా ముఖం పెట్టి.

అతని అమాయకపు మాటలకు బిగ్గరగా నవ్వాడు ఇంజనీరు. "మన పల్లెల్లో వాళ్లకి కాపీ కొట్టటం బలే వచ్చు" అనుకున్నాడు. చులకన భావంతో అతని మనసు తేలికై, అలా అలా గాలిలో ఊగింది. "ఇతన్ని ఆట పట్టించేందుకు మరో అవకాశం ఇస్తున్నాడు- భలే" అనుకున్నాడు. పైకి మటుకు "సరే,.. అలాగే.. నువ్వడిగింది కూడా న్యాయంగానే వుందిగా?! కానివ్వు...!" అన్నాడు.

"మీరు ఒక సాఫ్టువేరు ఇంజనీర్!" టక్కున చెప్పాడు గొర్రెల కాపరి.

ఊహించని ఈ జవాబుకి ఇంజనీరుకు

దిమ్మ తిరిగినట్లయింది. వెంటనే తేరుకొని "నీకెలా తెలిసింది...?" అని అడిగాడు.



గొర్రెల కాపరి చిరునవ్వు నవ్వాడు. "సార్! నా గొర్రెలు ఎన్ని ఉన్నాయో నాకు తెలుసు. లెక్క పెట్టుకునేందుకు ఏమంత సమయం పట్టదు కూడాను. అయినా దాని కోసం మీరు సెల్‌ఫోను బయటికి తీసారు. దాన్ని బట్టే మీరు ఎవరో అర్థమైపోయింది నాకు.

ఇక రెండోది, నా గొర్రెలు ఎన్ని ఉన్నాయో నాకే చెప్పి, కనుక్కున్నందుకుగాను మీకు బహుమతిని ఇమ్మన్నారే, అట్లా అనగలిగే సామర్థ్యమూ, తెలివితేటలూ, అసలు అలాంటి బుద్ధి అంతా సాఫ్టువేరు ఇంజనీర్లకు మాత్రమే ఉంటుంది. దాని నుండి కూడా మీరెవరో తెలిసిపోయింది నాకు.

ఇక మూడో సంగతి ఏంటంటే, మీకు ఏ మాత్రం అనుభవం లేని పనిని కూడా మీరు 'అవలీలగా చేయగలరు' అనుకుంటున్నారు. నిజానికి మీరు గొర్రెల్ని చూడలేదు; వాటి అలవాట్లేంటో మీకు తెలీదు; వాటిని ఎట్లా పెంచాలో మీకు తెలీదు; అయినా అన్నీ తెలిసినట్లు పందెం కట్టారు. అట్లాంటి శక్తి కేవలం సాఫ్టువేరు ఇంజనీర్లకు మాత్రమే ఉంటుంది తప్ప, ఇతరులకు అది సాధ్యమే కాదు. అట్లా మీరెవరో నాకు మూడు రకాలుగానూ తెలిసిపోయింది.

అయినా మీకు గొర్రెల గురించి తెలీదని నాకు ఎట్లా తెలిసింది అంటారేమో.. మీరు ఎత్తుకెళ్తున్నది గొర్రె కాదు; అది నా పెంపుడు కుక్క! దయచేసి నా కుక్కను నాకు వదిలి వెళ్ళండి!" అన్నాడు చిరునవ్వుతో.

సిగ్గు పడిన సాఫ్టువేరు ఇంజనీరు కుక్కను నేలమీదికి జారవిడిచి, ఎర్రబారిన ముఖంతో తన కారువైపుకు అడుగులు వేసాడు.

బొమ్మలు - పదాలు 5

రెండో తరగతి పిల్లలకు ప్రత్యేకం : *ఇక్కడ పది బొమ్మలున్నై. ఒక్కో బొమ్మనుండీ* ***రెండు-లేక-మూడు అక్షరాల పదాలు*** *తయారవుతాయి- చూడండి. వింత ఏంటంటే ఆ పది పదాలూ 'ఉ' తోటే మొదలౌతున్నై! బొమ్మల్ని చూసి పదాలు కనుక్కోండి మరి !*

నిర్వహణ : శ్రీమతి ఆదూరి హైమావతి, అమెరికా సంయుక్త రాష్ట్రాలు



1


2



3


4


5


6


7


8


9


10

"బొమ్మలు-పదాలు 1 నుండి బొమ్మలు-పదాలు 6" వరకూ వచ్చిన పదాలన్నీ దాచి పెట్టుకోండి. చివరికి, అన్నిటినీ ఓ పోస్టు కార్డు మీద రాసి పంపాలి మాకు! అట్లా అన్నీ సరిగా రాసి పంపిన **రెండో తరగతి పిల్లల్లో** లాటరీ ద్వారా ఎంపికైన **ఇద్దరికి** - ఒక్కొక్కరికీ 500 రూ. బహుమతి ఇవ్వబడుతుంది !

పదాల్ని వెతికి పట్టుకోండి!

చైతన్యం, నమ్మకం, అవకాశం, సుడిగుండం, అరణ్యం, బహుమానం, కాగితం, ప్రయత్నం, జీవనం, సమానత్వం, రామాపురం, మధ్యాహ్నం, నేతగాడు, మొక్కలు, రాగులు, బలహీనత, పండితుడు, ఆటంకం, పట్టుదల, ఉత్సాహం:- *ఈ పదాలన్నీ క్రింది పట్టికలో దాగున్నాయి-నిలువుగా, అడ్డంగా, వాలుగా, క్రింది నుండి పైకి -ఎటుపడితే అటు! వాటిని వెతికి వాటి చుట్టూ గుండ్రాలు గీయండి!*

న	అ	బ	గా	డి	త	రా	కా	ధ్యా	లు	త	ప
డం	గుం	డి	సు	మా	హం	త్సా	ఉ	క్క	న	కా	బ
న	ధ్యా	క్క	లు	రా	డు	ప	ట	జీ	వ	నం	గా
పం	ప	డు	రం	పు	దూ	రా	డి	మ	ప	మా	త
డి	లు	ట్టు	లు	అ	బ	కా	త్వం	ధ్యా	లు	హు	మా
తు	అ	క్క	ద	చై	త	న్యం	న	హ్నం	కం	బ	స
డు	ర	డి	త	ల	ట	రా	మా	న	మ్మ	మా	బ
గా	ణ్యం	న	ధ్యా	లు	క్క	మొ	స	బ	న	ల	రా
శం	అ	లు	గు	ప	మా	ప్ర	య	త్నం	హీ	డు	అ
కా	న	రా	డు	తం	గి	కా	లు	న	క్క	లు	ట
వ	బ	రా	ట	ధ్యా	గా	నే	త	గా	డు	డు	మా
అ	న	ప	కం	టం	ఆ	త	అ	లు	కా	ప	డి

మీ గ్రహణ శక్తిని పెంచుకునేందుకు ఇదో చక్కని అభ్యాసం!

పదరంగం-91

నిర్వహణ: డా. సిరి, మిర్యాలగూడ, నల్గొండ జిల్లా, తెలంగాణ రాష్ట్రం

1	2	★	3		4
5		6		★	
7			★	8	
	★	9		★	
★	10	★	★	11	
12					

అడ్డం:

1. 'జామకాయ'లో మొదటి రెండక్షరాలు (2)

3. 'కోరికలు' ఏకవచనం (3)

5. ఏడుకొండల వాడి ఊరు (4)

7. తడబడిన 'పిలుపు' (3)

8. తిరగబడిన 'లేఖ' (2)

9. శునకం, వాడుక భాషలో ఇలా పిలుస్తాం (2)

11. 'వేరుశనగ' లోంచి శనగ పోతే, మిగిలేది (2)

12. అడ్డం ఐదులో కొలువైన దేవుడు (6)

నిలువు:

1. మహాత్మా గాంధీ మన__ (4)

2. 'మతిమరుపు'లో మతిపోతే, మిగిలేది (3)

3. వానరం, వాడుకభాషలో (2)

4. కపిలతీర్థంలో కొలువైన శివుడ్ని ఇలా పిలుస్తాం(6)

6. 'తేనెపలుకు'లో 'మాట'ను సూచించే పదం (3)

10. 'మే' అని అరిచే జంతువు (2)

11. మొక్క నీటిని దీనితో పీల్చుకుంటుంది (2)

అడ్డం-నిలువు ఆధారాల సహాయంతో ఈ గడులను నింపగలరేమో చూడండి. నింపిన పదరంగాన్ని, కేవలం పోస్టుకార్డుపై రాసి, మాకు అందేట్లు పంపండి. మీ బడి పేరు, తరగతి, మీవాళ్ల ఫోను నంబరు తప్పక రాయండి.

సరైన సమాధానం రాసి ఎంపికైన ముగ్గురు పిల్లలకు కొత్తపల్లి - 93 ని బహుమతిగా పంపిస్తాం!

కొత్తపల్లి ప్రింటు పుస్తకాలను ఆన్‌లైన్లో ఆర్డరు చేయటం, చందాలు కట్టటం చాలా సులువు! క్రెడిట్ కార్డుల ద్వారాను, డెబిట్ కార్డుల ద్వారాను, నెట్ బ్యాంకింగ్ ద్వారా కూడా ఇప్పుడు కొత్తపల్లికై డబ్బులు చెల్లించవచ్చు! అక్కౌంటు నెంబర్లు వెతుక్కునే పని కూడా లేదు! సందర్శించండి: **http://www.instamojo.com/kottapalli**

కొత్తపల్లిని మీ మిత్రులకు, మీరు చదివిన బడులకు, మీ సమీపంలోని లైబ్రరీలకు బహూకరించండి!



రాబోయే 12 సంచికలకై ముందస్తు చందా:

వ్యక్తులకు: **300/-** (పోస్టేజీ మరియు యస్సెమ్మెస్ ఛార్జీలు కలిపి)

సంస్థలకు: **350/-**

గమనిక: అచ్చయిన పుస్తకాలు ఎప్పటికప్పుడు సాధారణ పోస్టులో పంపబడతాయి.

కొత్తపల్లి పుస్తకానికి చందా కట్టే సంస్థల వారు బ్యాంక్ అక్కౌంటులో జమ చేయాలని మనవి.

ఆన్‌లైన్ చందా సౌకర్యం కేవలం వ్యక్తులకు మాత్రమే. సంస్థలకు: 350/- వ్యక్తులకు: 300/-

NEFT TRANSFER కోసం:

"Kottapalli Prachuranalu"
SB A/c 62320333310,
State Bank of Hyderabad
Dharmavaram Branch
IFSC: SBHY0020902

(బ్యాంకు వారి కొత్త నియమాలననుసరించి, "క్యాష్ హ్యాండ్లింగ్ చార్జీలు"గా ప్రతిసారీ రూ. 50 అదనంగా చెల్లించవలసి వస్తున్నది.. అందువల్ల బ్యాంకులో డబ్బు కట్టకండి- నేరుగా మీ అక్కౌంటు నుండే ట్రాన్స్‌ఫర్ చేయగలరని ప్రార్థన)

ప్రస్తుతం అందుబాటులో ఉన్న కొత్తపల్లి ప్రింటు పుస్తకాల వివరాలు:


క్రమ సంఖ్య	వివరాలు	ఒక సెట్ లోని పుస్తకాల సంఖ్య	స్టాకులో ఉన్న సెట్లు (సుమారుగా)	వెల (రూ) **(పోస్టేజి రూ 50 అదనం)**
1	2011 Set	11	11	220
2	2012 Set	12	12	240
3	2013 Set	7	3	175
4	2014 Set	10	403	250
5	2015 Set	7	914	175
6	2016 Set	8	1178	200

మరిన్ని వివరాలకై సంప్రతించండి: కొత్తపల్లి ప్రచురణలు, 1-127/A, యంఆర్వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా, 515101. ఫోను: 7702877670, 9000453887. ఇ-మెయిలు : team@kottapalli.in

RNI Regn No. : APTEL/2014/62705 Date Of Publishing: 05/04/2017 Postal Regn No: HDP/008/2015-2017

మంచి పుస్తకం:

ప్రపంచ ప్రసిద్ధ జానపద కథలు



108 పెద్ద పేజీలు; వెల 90 రూ.

ఏ కాలానివైనా, ఏ దేశానివైనా, ఏ భాషవైనా తరతరాల అనుభవాల, అనుభూతుల సారాలు జానపద కథలు.

చిత్ర విచిత్రమైన చమత్కారాలు, మానవ జీవితంతో కలగలసిపోయిన దురాశలు, కుయుక్తులు, జిత్తులు, వాటిని పరిష్కరించే యుక్తులు- ఎన్నెన్నో జానపద కథల్లో విరివిగా దొరుకుతాయి. తమని చదివే పిల్లల్ని తమతోబాటు చుక్కల లోకాలకూ, అందాల సీమలకూ కొనిపోతాయి ఇవి. జీవితాన్ని సంతోషానందాలతో గడిపేందుకు అవసరమైన విలువలను అందిస్తాయివి.

నూలు వడికే వాళ్ళు, మంత్రగత్తెలు, వెర్రివెంగళమ్మలు, దొంగలు బంగారు భరిణలు, రెక్కల గుర్రాలు, ద్రాక్ష రసాలు, ఆకాశ దేవతలు, రాతి సింహాలు, బలి ఇవ్వటాలు, ప్రేతాత్మలు, స్వామీజీలు, మోసగాళ్ళు, బంగారు జింకలు- ఇలాంటి అత్యద్భుత ప్రాణులు (ప్రాణాలు లేనివాళ్ళు కూడా!)- ఎందరో ఈ కథల్లో నిండా ఉంటారు.

చదివేవాళ్ళని వాళ్ళంతా తమ తమ లోకాలకు తీసుకెళ్తారు. వాళ్ళవైన పరిస్థితులను పరిచయం చేస్తారు. మన దృష్టిని చెప్పలేనంత వింత పద్ధతుల్లో విశాలం చేసిపడేస్తారు.

జానపద కథలు అన్నీ పిల్లలకు సరిపోయేవిగా ఉండవు. ఒక్కో దేశానికీ ఒక్కో తీరు కూడాను. వివిధ దేశాల జానపద కథల్లో పిల్లలకి అందని వాటిన్నన్నింటినీ సవరించి, తనదైన శైలిలో మార్చి, ఎక్కడా లొసుగులు లేకుండా మళ్ళీ చెప్పి, నిజంగా మెప్పించిన మండువ రాధగారు అభినందనీయులు, కథల్ని పుస్తకంగా ప్రచురించిన విశాలాంధ్ర వారు ధన్యులు.

"Kottapalli" Printed and Published by Narayana Sarma on behalf of Kottapalli Prachuranalu and printed at Mudrica Offset Printers, Vijayawada and published at 1-127/A, Near MRO Office, Chennekothapalli, Ananthapuram District, AP-515101. Editor: Narayana Sarma.